తెలంగాణ
TELANGANA MUCHATLU
ముచ్చట్లు
తెలుగు దిన పత్రిక
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
వరంగల్ | శుక్రవారం - 06 - ఫిబ్రవరి 2026 | సంపుటి:3 | సంచిక:250 | పేజీలు:8 | వెల: రూ.5 | www.telanganamuchatlu.in



# హుజూరాబాద్ అభివృద్ధే బీజేపీ లక్ష్యం: బండి సంజయ్

మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో ఘాటు విమర్శలు

కేంద్ర నిధులతో హుజూరాబాద్‌కు కోట్ల రూపాయల అభివృద్ధి


మున్సిపల్ చైర్మన్ పీఠం దక్కితే పెండింగ్ పనుల పూర్తి

ఆలోచించి బీజేపీని గెలిపించాలన్న పిలుపు

**హుజూరాబాద్, ఫిబ్రవరి 5 (తెలంగాణ ముచ్చట్లు):**

మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా హుజూరాబాద్ పట్టణంలో ఎన్నికల ప్రచారం నిర్వహించిన కేంద్ర సహాయక మంత్రి బండి సంజయ్, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలపై తీవ్ర విమర్శలు చేశారు. హుజూరాబాద్ మున్సిపాలిటీకి రూపాయి కూడా ఇవ్వని బీఆర్ఎస్‌కు, గాడిద గుడ్డు ఇచ్చిన కాంగ్రెస్‌కు ఓట్లు అడిగే హక్కు లేదని అన్నారు. రాష్ట్రంలో అధికారంలో లేకపోయినా కేంద్రం నుంచి నిధులు తెచ్చి హుజూరాబాద్ అభివృద్ధికి పాటు పడ్డామని బండి సంజయ్ తెలిపారు. 14, 15వ ఆర్థిక సంఘాల ద్వారా రూ.19 కోట్లు 57 లక్షలు, స్వచ్ఛ భారత్ కింద రూ.1.10 కోట్లు, అమృత్ పథకం కింద రూ.16.25 కోట్లు, స్వనిధి పథకం కింద రూ.7.63 కోట్లు, పట్టణ మౌలిక సదుపాయాల కింద రూ.36 కోట్లు హుజూరాబాద్‌కు మంజూరు చేయించినట్లు చెప్పారు.

మిగతా 2లో..



## వరంగల్–కరీంనగర్ జంట నగరాలుగా

# అభివృద్ధి చేస్తాం

సీఎం రేవంత్ రెడ్డి



ఔటర్‌రింగ్ రోడ్లు, డంప్ యార్డ్, విద్యుత్ కేంద్రం ప్రణాళిక

చొప్పదండిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

గోదావరి పుష్కరాల నాటికి దేవాలయాల సమగ్ర అభివృద్ధి

సంక్షేమం–ఉపాధి–మహిళా సాధికారతపై దృష్టి

**కరీంనగర్ జిల్లా, ఫిబ్రవరి 5 (తెలంగాణ ముచ్చట్లు):**

వరంగల్-కరీంనగర్ పట్టణాల సమగ్రాభివృద్ధికి బృహత్ ప్రణాళికను ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఈ రెండు పట్టణాలకు ఔటర్ రింగ్ రోడ్లను పూర్తి చేసి, వాటిని అనుసంధానించేలా రహదారులను విస్తరించనున్నట్లు తెలిపారు. వరంగల్-కరీంనగర్ మధ్య అతి పెద్ద డంప్ యార్డ్ ఏర్పాటు చేసి, అక్కడే విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని నిర్మిస్తామని వెల్లడించారు.

మిగతా 2లో..

## నల్లగొండలో కాంగ్రెస్ రోడ్‌షోకు విశేష స్పందన

అన్ని డివిజన్లలో గెలుపే లక్ష్యం..

అభివృద్ధికి మరిన్ని నిధులు తీసుకొస్తా : కోమటిరెడ్డి వెంకటరెడ్డి

2లో



## డీజీపీ నియామకంపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు

4 వారాల్లో ప్రక్రియ పూర్తి చేయాలి..

శివధర్ రెడ్డి డీజీపీ నియామకంపై హైకోర్టు తీర్పును సమర్థించిన సుప్రీంకోర్టు




2లో



## గ్రూప్-1 కేసుకు ఫుల్ స్టాప్.. అభ్యర్థులకు న్యాయం

స్టే ఎత్తివేసిన హైకోర్టు.. పారదర్శకతపై ముద్ర వేసిన ధర్మాసనం



## మేడారం హుండీల లెక్కింపు ప్రారంభం

కొబ్బరికాయ కొట్టి ప్రారంభించిన మంత్రి కొండా సురేఖ

మొదటి 2.49 కోట్లకు పైగా ఆదాయం

మొత్తం 828 హుండీలు ఉండగా, 125 తెరిచి లెక్కించారు

**హనుమకొండ, ఫిబ్రవరి 5 (తెలంగాణ ముచ్చట్లు):**

ఆసియా అతిపెద్ద గిరిజన జాతరగా పేరొందిన మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర హుండీల లెక్కింపు హనుమకొండలోని టిటిడి కళ్యాణ మండపంలో ప్రారంభమైంది. ఈ లెక్కింపు ప్రక్రియ దాదాపు పది రోజుల పాటు కొనసాగనున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. జాతర సందర్భంగా మేడారం నుంచి హనుమకొండకు తరలించిన హుండీలను పకడ్బందీ భద్రత మధ్య లెక్కిస్తున్నారు. హుండీల లెక్కింపును రాష్ట్ర మంత్రి కొండా సురేఖ కొబ్బరికాయ కొట్టి అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా లెక్కింపు ప్రక్రియ పూర్తిస్థాయి పారదర్శకతతో నిర్వహించాలని అధికారులకు సూచనలు చేశారు. ఎండోమెంట్స్ శాఖ సిబ్బంది, సేవా సమితి సభ్యుల పర్యవేక్షణలో లెక్కింపు శాంతియుతంగా కొనసాగుతోంది.

మిగతా 2లో..

## సీఎం రేవంత్‌రెడ్డికి ఇచ్చిన సర్టిఫికెట్‌ను వెనక్కి తీసుకోవాలి

- హార్వర్డ్ విశ్వవిద్యాలయానికి లేఖ రాసిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్
- రాజకీయ ప్రవర్తన 21వ శతాబ్దానికి తగదని విమర్శ

**హైదరాబాద్, ఫిబ్రవరి 5 (తెలంగాణ ముచ్చట్లు):**

బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రపంచ ప్రఖ్యాత హార్వర్డ్ యూనివర్సిటీకి లేఖ రాశారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఇచ్చిన సర్టిఫికెట్‌ను వెంటనే వెనక్కి తీసుకోవాలని ఆ లేఖలో డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు.

మిగతా 2లో..



## గజ్వేల్‌లో మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో హరీశ్‌రావు రోడ్‌షో

ప్రజ్ఞాపూర్, గజ్వేల్‌లో విస్తృత పర్యటన..

కేసీఆర్ అభివృద్ధిని గుర్తు చేసిన మాజీ మంత్రి

రేవంత్ రెడ్డి వైఫల్యాలపై తీవ్ర విమర్శలు.. కారు గుర్తుకు ఓటేయాలని పిలుపు



**గజ్వేల్, ఫిబ్రవరి 5 (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి):**

మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా గజ్వేల్ నియోజకవర్గంలోని ప్రజ్ఞాపూర్, గజ్వేల్ పట్టణాల్లో మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ టి. హరీశ్‌రావు పర్యటించి రోడ్ షోలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు హాజరై ఆయనకు ఘన స్వాగతం పలికారు.

మిగతా 2లో..



## హైదరాబాద్‌లో సైబర్ షీల్డ్ 2026 సదస్సు ప్రారంభం

రెండవ ఎడిషన్‌కు ఘన ప్రారంభం

సైబర్ నేరాల నివారణపై దృష్టి

బాధితులకు మద్దతు వ్యవస్థ బలోపేతం

2లో

సిరిసిల్లలో మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో

## కేటీఆర్ తీవ్ర విమర్శలు

రైతుబంధుపై కాంగ్రెస్ మోసం..

అడ్డగోలు హామీల అమలు ఎక్కడ?.. జిల్లాల రద్దుపై కుట్ర ఆరోపణ

కేసీఆర్‌ను తిరిగి సీఎం చేయాలన్న పిలుపు

2లో



తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# సిరిసిల్లలో మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో కేటీఆర్ తీవ్ర విమర్శలు

**సిరిసిల్ల, ఫిబ్రవరి 5 (తెలంగాణ ముచ్చట్లు):** సిరిసిల్ల పట్టణంలో మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. మున్సిపల్ ఎన్నికల తర్వాత రైతుబంధు వేస్తామని సీఎం చెబుతున్నారని, అయితే ఇప్పటివరకు ఎన్ని పంటకాలాలు గడిచాయో, రైతులకు ఎన్నిసార్లు రైతుబంధు వేశారో చెప్పాలని కేటీఆర్ ప్రశ్నించారు. మున్సిపల్ ఎన్నికలు రైతుబంధు రైతుల ఖాతాల్లో వేయడానికి ఏ విధంగా అడ్డొస్తున్నాయో ప్రజలు ఆలోచించాలని అన్నారు. ఎన్నికల సమయంలో మాత్రమే ఆశలు చూపించి, ఎన్నికలు పూర్తయ్యాక మళ్లీ ప్రజలను మోసం చేయడానికే కాంగ్రెస్ ఈ మాటలు చెబుతోందని కేటీఆర్ ఆరోపించారు. అధికారంలోకి రావడానికి ముందు ఇచ్చిన హామీల్లో ఒక్కటైనా అమలు చేశారా అని ప్రశ్నించారు. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి పథకాలను కూడా పక్కన పెట్టారని, అడ్డగోలు హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోందని మండిపడ్డారు. ముఖ్యమంత్రికి అధికారమూ, అవకాశం ఉన్నప్పుడు గత ముఖ్యమంత్రి కేసీఆర్ను తిట్టాల్సిన అవసరం ఏముందని కేటీఆర్ ప్రశ్నించారు. చేతనైతే ప్రజలకు మంచి చేయాలని, ఇచ్చిన హామీలను అమలు చేయాలని సూచించారు. కానీ ఈ రెండేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క మంచి పని కూడా చేయలేదని, కేవలం అబద్ధాలు మాట్లాడటమే తప్ప ప్రజలకు ఉపయోగపడే నిర్ణయాలు తీసుకోలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేసీఆర్ ఏర్పాటు చేసిన చిన్న జిల్లాలను ఎత్తివేయాలని కుట్ర పన్నుతోందని కేటీఆర్ ఆరోపించారు. జిల్లా కేంద్రాలను రద్దు చేస్తామని చెప్పిన పార్టీకి ఓటు వేయాలా? వద్దా? అనే విషయాన్ని ప్రజలు ఆలోచించాలని సూచించారు. ఈ మున్సిపల్ ఎన్నికల పోటీ గత పదేళ్లుగా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేసిన బీఆర్ఎస్ పార్టీకి, రెండేళ్లలోనే ఉన్న పథకాలను ఎత్తివేసిన కాంగ్రెస్ పార్టీకి మధ్య జరుగుతోందని చెప్పారు. మరోసారి కేసీఆర్‌ను ముఖ్యమంత్రిని చేస్తేనే అభివృద్ధి, సంక్షేమ పథకాలు తిరిగి ప్రారంభమవుతాయని, ఆ దిశగా ఈ మున్సిపల్ ఎన్నికల నుంచే ఉద్యమం మొదలుపెట్టాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.

# హుజూరాబాద్ అభివృద్ధే బీజేపీ లక్ష్యం: బండి సంజయ్

(మొదటి పేజీ తరువాయి)

వీధి దీపాలు, డ్రైనేజీలు, రోడ్లు, స్మశానవాటికల అభివృద్ధికి కూడా కేంద్ర నిధులే ఉపయోగపడ్డాయని తెలిపారు.
ఇవి కాకుండా సీఎస్సార్, ఎంపీ లాడ్స్ నిధులతో కోట్ల రూపాయలు తెచ్చి హుజూరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి ఆధునిక వైద్య పరికరాలు అందించామని చెప్పారు. కమ్యూనిటీ హాల్స్ నిర్మాణం, బోర్లు వేయించడం, పదవ తరగతి చదివే విద్యార్థులందరికీ ఉచిత సైకిళ్లు, పరీక్ష ఫీజుల చెల్లింపు వంటి కార్యక్రమాలు చేపట్టామని పేర్కొన్నారు. అందుకే హుజూరాబాద్ ప్రజలను ఓట్లు అడుగుతున్నానని, బీజేపీకి ఎందుకు ఓటు వేయాలో కారణాలు చెబుతున్నానని అన్నారు. బీజేపీకి హుజూరాబాద్ మున్సిపల్ చైర్మన్ పీఠం అప్పగిస్తే, అర్ధాంతరంగా నిలిచిపోయిన మినీ ట్యాంక్ బండ్ పనులను పూర్తి చేయిస్తానని బండి సంజయ్ హామీ ఇచ్చారు. అవసరమైన చోట మురుగు కాలువలు, సీసీ రోడ్లు, విద్యుత్ దీపాల ఏర్పాటు చేస్తామని చెప్పారు. హుజూరాబాద్‌లో మినీ స్టేడియం ఏర్పాటు చేయడానికి ప్రత్యేక చొరవ తీసుకుంటానని, 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందేలా చూస్తానని తెలిపారు. హుజూరాబాద్ అభివృద్ధి కోసం ప్రజలు ఆలోచించి మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని ఆయన కోరారు.

# నల్లగొండలో కాంగ్రెస్ రోడ్‌షోకు విశేష స్పందన

**నల్లగొండ, ఫిబ్రవరి 5 (తెలంగాణ ముచ్చట్లు):** నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల ప్రచారంలో భాగంగా నల్లగొండ పట్టణంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ రోడ్‌షోకు ప్రజల నుంచి విశేష ఆదరణ లభించింది. ఈ రోడ్‌షోలో కాంగ్రెస్ శ్రేణులు, మహిళలు, యువత పెద్ద ఎత్తున పాల్గొని ఉత్సాహంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదల జీవితాల్లో స్పష్టమైన మార్పు తీసుకొస్తున్నాయని పేర్కొన్నారు. రైతు భరోసా, రుణమాఫీ, ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలు ప్రజలకు నేరుగా ఉపయోగపడుతున్నాయని తెలిపారు. నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నలభై ఎనిమిది డివిజన్లలో కాంగ్రెస్ కార్పొరేటర్లు గెలిస్తే, పట్టణ అభివృద్ధికి మరిన్ని నిధులు తీసుకొచ్చి వేగవంతమైన అభివృద్ధి సాధిస్తానని హామీ ఇచ్చారు. మౌలిక సదుపాయాల విస్తరణ, పారిశుద్ధ్యం, తాగునీరు, రోడ్ల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తామని చెప్పారు. హస్తం గుర్తుపై ఓటు వేసి కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోమటిరెడ్డి వెంకటరెడ్డి కోరారు. నల్లగొండ ప్రజలు చైతన్యవంతులని, ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఘన విజయం అందిస్తారని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

# హైదరాబాద్‌లో సైబర్ షీల్డ్ 2026 సదస్సు ప్రారంభం

**హైదరాబాద్, ఫిబ్రవరి 5 (తెలంగాణ ముచ్చట్లు):** హైదరాబాద్‌లో సైబర్ సెక్యూరిటీ కాన్క్లేవ్ షీల్డ్ రెండు వేల ఇరవై ఆరు రెండవ ఎడిషన్ ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తెలంగాణ సీఎస్, తెలంగాణ డీజీపీ తెలంగాణ డీజీపీతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉన్నతాధికారులు, సైబర్ నిపుణులు పాల్గొన్నారు.
సైబర్ నేరాల నివారణ, సాంకేతిక భద్రత బలోపేతం, తాజా సవాళ్లపై అవగాహన పెంపొందించడం లక్ష్యంగా ఈ సదస్సును నిర్వహిస్తున్నారు. పెరుగుతున్న సైబర్ మోసాలు, ఆన్‌లైన్ నేరాల నేపథ్యంలో సమన్వయ చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని వక్తలు ప్రస్తావించారు. సైబర్ నేరాల బాధితులకు తక్షణ సహాయం, ఫిర్యాదుల పరిష్కారం, సాంకేతిక మద్దతు అందించేందుకు సైబర్ షీల్డ్ రెండు వేల ఇరవై ఆరు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రభుత్వ విభాగాలు, చట్ట అమలు సంస్థలు, నిపుణుల మధ్య సహకారం పెంచడంపై ప్రత్యేక దృష్టి సారించారు. సైబర్ భద్రతపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా రాష్ట్రాన్ని సురక్షిత డిజిటల్ వాతావరణంగా తీర్చిదిద్దాలనే లక్ష్యాన్ని సదస్సు ప్రతిబింబిస్తోందని అధికారులు తెలిపారు.

# ..అభివృద్ధి చేస్తాం

(మొదటి పేజీ తరువాయి)



కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గంలోని గుమ్లాపూర్‌లో నిర్వహించిన "ప్రజాపాలన - ప్రగతి బాట" కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా చొప్పదండిలో రూ.45.15 కోట్లతో నిర్మించనున్న అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్‌కు, అలాగే గంగాధర మండలంలో రూ.5 కోట్లతో ప్రభుత్వ డిగ్రీ కాలేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతూ, వరంగల్‌కు ఔటర్ రింగ్ రోడ్‌తో పాటు విమానాశ్రయాన్ని పూర్తి చేసి, కరీంనగర్ ఔటర్ రింగ్ రోడ్డుతో అనుసంధానం చేసి జంట నగరాలుగా దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. 2027లో జరిగే గోదావరి పుష్కరాల నాటికి ఆదిలాబాద్ బాసర నుంచి ఖమ్మం భద్రాచలం వరకు ఉన్న అన్ని దేవాలయాలను సమగ్ర ప్రణాళికలతో అభివృద్ధి చేస్తామని సీఎం తెలిపారు. అవసరమైతే నాలుగు నుంచి ఐదు వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి దేవాలయాలను పుణ్యక్షేత్రాలు, పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దుతామని చెప్పారు. మధ్యలో అటవీ ప్రాంతాల్లో ఎకోటూరిజాన్ని కూడా అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. రాష్ట్రంలో రైతులు, విద్యార్థులు, యువత, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామని సీఎం పేర్కొన్నారు. వ్యవసాయాన్ని పండగగా మార్చాలన్న సంకల్పంతో రుణమాఫీ, గిట్టుబాటు ధర, సన్నవడ్లకు బోనస్, రైతు బీమా, రైతుభరోసా వంటి పథకాలతో వ్యవసాయ రంగానికి రూ.1.15 లక్షల కోట్లను ఖర్చు చేశామని తెలిపారు. గడిచిన రెండేళ్లలో 70 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని, వంద యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణం చేపట్టామని చెప్పారు. మహిళల కోసం ఆర్టీసీలో ఉచిత బస్సు సౌకర్యం, మహిళా సంఘాలకు సున్నా వడ్డీకే రూ.27 వేల కోట్లు, వెయ్యి బస్సులు, పెట్రోల్ బంకులు, వెయ్యి మెగావాట్ల సోలార్ విద్యుత్ కేంద్రాల కేటాయింపులు చేశామని వివరించారు. ఈ సభలో జిల్లా ఇంచార్జీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో పాటు మంత్రులు దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రసంగించారు. ఈ సందర్భంగా కరీంనగర్ శ్రీ సీతారామచంద్ర జిల్లా మహిళా సమాఖ్యకు రూ.110.10 కోట్ల చెక్కును ముఖ్యమంత్రి అందించారు.

# గజ్వేల్‌లో మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో హరీశ్‌రావు రోడ్‌షో

(మొదటి పేజీ తరువాయి)



రోడ్ షోలో మాట్లాడిన హరీశ్‌రావు, కేసీఆర్ రాకముందు గజ్వేల్ ఎలా ఉండేదో, ఇప్పుడు ఎలా మారిందో ప్రజలు ఆలోచించాలని అన్నారు. ప్రజ్ఞాపూర్-గజ్వేల్ రోడ్డు గతంలో దుస్థితిలో ఉండేదని, అప్పట్లో గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రి పందులకు నిలయంగా మారిన పరిస్థితి ఉందని గుర్తు చేశారు. కేసీఆర్ పాలనలో 250 పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేసి పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించారని తెలిపారు. గజ్వేల్‌కు ఆర్డీవో కార్యాలయం, రైల్వే సౌకర్యం, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, ఊర చెరువు, పాండవుల చెరువు సుందరీకరణ వంటి కీలక అభివృద్ధి పనులు కేసీఆర్ హయాంలోనే జరిగాయని హరీశ్‌రావు పేర్కొన్నారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా పేదింటి ఆడబిడ్డల పెళ్లికి రూ.1,00,116 అందించి మేనమామలా ఆదుకున్నది కూడా కేసీఆర్‌నేని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనపై తీవ్ర విమర్శలు చేసిన హరీశ్‌రావు, కేసీఆర్ అమలు చేసిన అనేక సంక్షేమ పథకాలను నిలిపివేసి రాష్ట్రాన్ని ఆగమాగం చేశారని ఆరోపించారు. తెలంగాణను కాపాడుకోవాలంటే మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ కారు గుర్తుకే ఓటేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఇప్పుడెన్నికయ్యే కౌన్సిలర్లు ఐదేళ్లు కొనసాగుతారని, రెండేళ్లలో మళ్లీ కేసీఆర్ ప్రభుత్వమే వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రజ్ఞాపూర్ గౌరవం నిలవాలంటే బీఆర్ఎస్ గెలుపు అవసరమని హరీశ్‌రావు స్పష్టం చేశారు.

## గ్రూప్1 కేసుకు ఫుల్ స్టాప్..
# అభ్యర్థులకు న్యాయం

**హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణలో గ్రూప్1 నియామక ప్రక్రియకు సంబంధించి గత కొంత కాలంగా కొనసాగుతోన్న ఉత్కంఠకు ఎట్టకేలకు తెరపడింది. ఎంపికైన అభ్యర్థులకు భారీ ఊరటనిస్తూ తెలంగాణ హైకోర్టు డివిజన్ బెంచ్ కీలక తీర్పును ఇవాళ వెలువరించింది. గ్రూప్1 నియామకాలపై గతంలో సింగిల్ బెంచ్ విధించిన స్టేను సీజే ధర్మాసనం కొట్టివేసింది. విచారణ సందర్భంగా ఇరు పక్షాల వాదనలు విన్న కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. గ్రూప్1 నియామకాలు సక్రమమేనని.. పరీక్ష పారదర్శకంగానే జరిగిందని తేల్చి చెప్పింది. పరీక్షలో అవకతవకలు జరిగినట్లుగా ఎలాంటి ఆధారాలు లేవని స్పష్టం చేసింది.
అయితే, కాగా, గ్రూప్1 పరీక్షల నిర్వహణ, కరెక్షన్, బయోమెట్రిక్ నిబంధనల అమలులో లోపాలు ఉన్నాయంటూ పలువురు అభ్యర్థులు గతంలో హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన సింగిల్ బెంచ్ ధర్మాసనం గ్రూప్1 ఫలితాలను రద్దు చేస్తూ సంచలన తీర్పునిచ్చింది. అంతేకాకుండా, జవాబు పత్రాలను తిరిగి మూల్యాంకనం చేయాలని లేదా అవసరమైతే పరీక్షను మళ్లీ నిర్వహించాలని ఆదేశిస్తూ అప్పట్లో నియామకాలపై స్టే విధించింది.
అనంతరం సింగిల్ బెంచ్ తీర్పును సవాల్ చేస్తూ తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్, ఎంపికైన అభ్యర్థులు డివిజన్ బెంచ్‌లో అప్పీల్ చేశారు. ఈ క్రమంలోనే ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం సింగిల్ బెంచ్ ఇచ్చిన స్టేను ఎత్తివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ప్రభుత్వం వేగంగా స్పందించి ఎంపికైన 562 మంది అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేసింది. అయితే, ఈ నియామకాలు కోర్టు ఇచ్చే తుది తీర్పునకు లోబడి ఉంటాయని ధర్మాసనం అప్పుడే స్పష్టం చేసింది. అయితే, ఇవాళ వెలువడిన తుది తీర్పుతో 562 మంది గ్రూప్1 అభ్యర్థులు త్వరలోనే పదవీ బాధ్యతలు చేపట్టనున్నారు.

# డీజీపీ నియామకంపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు

**హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి నియామకంపై సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. 4 వారాల్లో డీజీపీ నియామక ప్రక్రియ పూర్తి చేయాలని యూపీఎస్సీ, తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించింది. గత ఏప్రిల్‌లో తెలంగాణ ప్రభుత్వం పంపించిన ప్రతిపాదనలను పరిగణలోకి తీసుకోవాలని ఆదేశించింది. గతేడాది తెలంగాణ డీజీపీగా బి.శివధర్ రెడ్డి నియామకం విషయంలో హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్‌పై ఇవాళ సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం విచారణ జరిపింది. హైకోర్టు తీర్పును సమర్థించింది. 4 వారాల్లో పూర్తి స్థాయి డీజీపీ నియామక ప్రక్రియ పూర్తి చేయాలని యూపీఎస్సీకి, తెలంగాణ ప్రభుత్వానికి ఆదేశించింది. ఈ సందర్భంగా సీజేఐ సూర్యకాంత్ వ్యాఖ్యానిస్తూ ఈ విషయాన్ని సింగిల్ జడ్జి బెంచ్ ముందు ఎందుకు లిస్ట్ చేశారు? ఆయన ఆదేశంలో తప్పేమీ లేదు. కానీ సాధారణంగా ఇలాంటి అంశాలను సీనియర్ జడ్జి విచారించాలని మేము ఆశిస్తామని అన్నారు. శివధర్ రెడ్డికి డీజీపీగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గతేడాది సెప్టెంబరు 26న జీవో జారీ చేసింది. అయితే ఈ నియామకం చెల్లదని, సదరు జీవోను కొట్టేయాలంటూ హైదరాబాద్‌కు చెందిన టీ ధనగోపాలరావు అక్టోబరు 10న తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. 'ప్రకాశ్‌సింగ్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' కేసులో డీజీపీల నియామకంపై సుప్రీంకోర్టు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసిందని.. దాని ప్రకారం డీజీపీని తాత్కాలిక పద్ధతిలో నియమించడానికి వీల్లేదని పిటిషనర్ పేర్కొన్నారు. విచారణ జరిపిన హైకోర్టు డీజీపీగా శివధర్ రెడ్డి నియామకానికి సంబంధించిన జీవో కొట్టివేతకు నిరాకరించింది. కానీ, డీజీపీ ఎంపిక ప్రక్రియను కొనసాగించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ ఆదేశాలను సవాల్ చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

# సీఎం రేవంత్‌రెడ్డికి ఇచ్చిన సర్టిఫికెట్‌ను వెనక్కి తీసుకోవాలి

(మొదటి పేజీ తరువాయి)

తాను హార్వర్డ్ యూనివర్సిటీకి ఈమెయిల్ ద్వారా విజ్ఞప్తి పంపినట్లు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. దేశంలో ఏ ముఖ్యమంత్రికీ లేనన్ని క్రిమినల్ కేసులు ఎదుర్కొంటూ, ఓటుకు నోటు కేసులో ఏసీబీకి రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిన వ్యక్తికి ఇలాంటి సర్టిఫికెట్ ఇవ్వడం సరైంది కాదని ఆయన అభిప్రాయపడ్డారు. దాదాపు 50 రోజులు జైలులో గడిపిన నేపథ్యం ఉన్న నాయకుడికి అకడమిక్ స్థాయి గుర్తింపు ఇవ్వడం అనుచితమని ఆరోపించారు. ప్రస్తుతానికి ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి పలు కుంభకోణాలకు పాల్పడుతున్నారని, తెలంగాణ ప్రజలపై ప్రతీకార రాజకీయాలు చేస్తున్నారని ప్రవీణ్‌కుమార్ విమర్శించారు. రాజకీయ ప్రత్యర్థులపై ప్రతి వేదికలో అభ్యంతరకరమైన భాషను ప్రయోగిస్తున్నారని, ఇలాంటి నాయకత్వం 21వ శతాబ్దానికి తగదని వ్యాఖ్యానించారు. ప్రాచీన రాతి యుగంలో కూడా ఇలాంటి నాయకులు ఉండి ఉండరని ఆ లేఖలో పేర్కొన్నట్లు తెలిపారు. ఈ అంశంపై రాష్ట్ర రాజకీయాల్లో చర్చ మొదలైంది. హార్వర్డ్ యూనివర్సిటీ ఈ విజ్ఞప్తిపై ఎలా స్పందిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది.

# మేడారం హుండీల లెక్కింపు ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)

మొత్తం 828 హుండీలు ఉండగా, మొదటి రోజు 125 హుండీలను తెరిచి లెక్కించారు. ఈ లెక్కింపులో నగదు రూపంలో రూ.2.49 కోట్లకు పైగా ఆదాయం సమకూరింది. బంగారం, వెండి లెక్కింపు ఇంకా ప్రారంభం కాలేదని అధికారులు తెలిపారు. లెక్కించిన నగదును బ్యాంకు అధికారులకు అప్పగించారు. రెండేళ్లకోసారి నిర్వహించే మేడారం మహా జాతర సమయంలోనే కాకుండా ముందు, తరువాత కూడా లక్షలాది భక్తులు అమ్మవార్లను దర్శించుకొని హుండీల్లో నగదు, బంగారం, వెండి, ఇతర కానుకలను సమర్పించారు. గత జాతరలో హుండీల ద్వారా సుమారు రూ.13 కోట్ల ఆదాయం సమకూరగా, ఈసారి భక్తుల రద్దీ అధికంగా ఉండటంతో ఆదాయం మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. హుండీల లెక్కింపు పూర్తయ్యాక పూర్తి వివరాలను వెల్లడిస్తామని తెలిపారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక




# విద్యుత్ సమస్యలపై 'పల్లె బాట'లోకి విద్యుత్ అధికారులు

◆ **వెల్టూర్ లో ముందస్తు చర్యలు – సర్పంచ్ అశోక్ చొరవ**

**పెద్దమందడి,ఫిబ్రవరి5(తెలంగాణ ముచ్చట్లు):**

పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామంలో వేసవి కాలంలో విద్యుత్ అంతరాయాలు కలగకుండా ముందస్తు చర్యలలో భాగంగా విద్యుత్ శాఖ ఆధ్వ ర్యంలో 'పల్లె బాట' కార్యక్రమం నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ దండు అశోక్ (చిట్టి) నేతృత్వం వహించారు.ఈ సందర్భంగా విద్యుత్ శాఖ జిల్లా ఎస్ ఈ తిరుపతిరావు, కొత్త కోట ఏడి శివశంకర్ రెడ్డి, పెద్దమందడి ఏఈ లక్ష్మణ్ నాయక్‌లు గ్రామమంతా వీధి వీధి తిరుగుతూ కిందకు వేలాడుతు న్న కరెంటు తీగలు, వంగిపోయిన పాత విద్యుత్ స్తంభాలను గుర్తించి అక్కడికక్క డే మరమ్మతులు చేయించారు. ట్రాన్స్ఫా ర్మర్ల వద్ద ఫ్యూజులు ఎగిరిపోకుండా, వంగిపోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందిని హెచ్చరించా రు.విద్యుత్ లైన్లపై వేలాడుతున్న చెట్ల కొమ్మలను వెంటనే తొలగించాలని జిల్లా ఎస్ ఈ తిరుపతిరావు ఆదేశించారు. గ్రామంలో విద్యుత్ సరఫరా, తరచూ ఏర్పడుతున్న అంతరాయాలు, హెచ్‌టీ/ ఎల్‌టీ లైన్ సమస్యలపై గ్రామ సర్పంచ్ దండు అశోక్ అధికారులకు వివరంగా తెలియజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అశోక్,గ్రామ పెద్దలు ఎం.జగ దీశ్వర్ రెడ్డి, దండు నరేష్, దండు యాది, జిల్లా ఎస్ ఈ తిరుపతిరావు, కొత్తకోట ఏడి శివశంకర్ రెడ్డి, పెద్దమందడి ఏఈ లక్ష్మ ణ్ నాయక్, లైన్ ఇన్‌స్పెక్టర్ సత్యం, లైన్ మెన్లు జగదీష్, బలరాం, కోటేష్‌తో పాటు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

# కొత్తకోట మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో తీన్మార్ మల్లన్న

◆ **టీఆర్పీతోనే ప్రజలకు న్యాయం – మల్లన్న పిలుపు**

**కొత్తకోట,ఫిబ్రవరి5(తెలంగాణ ముచ్చట్లు):**



వనపర్తి జిల్లా కొత్తకోట మున్సిపల్ ఎన్ని కల ప్రచార కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్పీ) అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పాల్గొన్నా రు.కొత్తకోట మున్సిపాలిటీలోని 3వ వార్డు టీఆర్పీ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి రఫీక్‌కు మద్దతుగా మల్లన్న ఇల్లు ఇల్లు తిరుగుతూ ప్రచారం నిర్వహించి ప్రజ లను ఓట్లను అభ్యర్థించారు.ఈ సంద ర్భంగా మల్లన్న మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు ఏళ్ల తరబడి మున్సిపాలిటీలను దోచుకున్నాయే తప్ప ప్రజలకు చేసిందేమీ లేదని తీవ్ర విమర్శ లు గుప్పించారు.పేదల సమస్యలు, మౌలిక వసతుల అభివృద్ధిని ఈ పార్టీలు పూర్తిగా విస్మరించాయని ఆరోపించా రు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో ఈ పార్టీలకు ప్రజలే సరైన బుద్ధి చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు.నిజంగా ప్రజల కోసం పోరాడే పార్టీ తెలంగాణ రాజ్యాధి కార పార్టీ మాత్రమేనని మల్లన్న పేర్కొ న్నారు.

# నాలుగు కొత్త కార్మిక కోడ్ లు అమలు...

◆ **ప్రాంతీయ పీఎఫ్ కమీషనర్ శ్రీనివాస్**

**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి -05 (తెలంగాణ ముచ్చట్లు)**

2025 నవంబర్ 21 నుంచి నాలుగు కొత్త కార్మిక కోడ్ లు అమలు లోకి వచ్చా యని ప్రాంతీయ పీఎఫ్ కమీషనర్ వై.డి. శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

భారత ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను ఏకీకృతం చేసి, నాలుగు సమగ్ర కార్మిక కోడ్ లను అమలులోకి తీసుకువచ్చింద ని అన్నారు.

వేతనాల కోడ్ 2019, పారిశ్రామిక సంబంధాల కోడ్ 2020, సామాజిక భద్రత కోడ్ 2020, వృత్తిపరమైన భద్రత, ఆరోగ్యం, పని ప్రదేశ పరిస్థితుల కోడ్ 2020 లను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని అన్నారు.

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త లేబర్ కోడ్స్ ప్రకారం ఈపిఎఫ్ వేతనాల నిర్వచనం ఏకరీతిగా అమలులోకి వచ్చిందని అన్నారు. వేతనాలు అంటే బేసిక్ పే, డియర్నెస్ అలవెన్స్ (డా), రిటైనింగ్ అలవెన్స్ కలిపి తీసుకోవా లనీ, హౌస్ రెంట్ అలవెన్స్ (హరా), బోనస్, ఓవర్టైమ్ అలవెన్స్, కన్వేయెన్స్ అలవెన్స్, కమీషన్, ఇతర సౌకర్యాల విలువలను వేతనాల నుండి మినహా యించాలని తెలిపారు. అయితే ఈ మినహాయింపులు మొత్తం వేతనంలో 50 శాతం కంటే ఎక్కువైతే, అదనపు భాగాన్ని తిరిగి వేతనాల నిర్వచనంలో కలపాలని అన్నారు.

నూతన విధానాల వల్ల ఈపిఎఫ్ కాం ట్రిబ్యూషన్ బేస్ పెరుగుతుందని, ఉద్యో గులకు పిఎఫ్ డిడక్షన్ ఎక్కువైనా, రిటైర్మెంట్ సేవింగ్స్ పెరుగుతాయని , యజమానులకు కాంప్లయెన్స్ స్పష్టత వస్తుందని, వేతనాలను కృత్రిమంగా తగ్గించడం కష్టమవుతుందని, ఈ మార్పులు ఉద్యోగుల భవిష్యత్ భద్రత ను బలోపేతం చేస్తాయని అన్నారు.

ఈ కార్మిక కోడ్ లు ఆత్మనిర్భర్ భారత్ లక్ష్య సాధనలో కీలక పాత్ర పోషిస్తా యని, కార్మికుల సంక్షేమం, వ్యాపార సౌలభ్యం మధ్య సమతుల్యతను కాపాడుతూ దేశ ఆర్థికాభివృద్ధికి తోడ్ప డతాయని, ఈ కోడ్ ల క్రింద లభించే ప్ర యోజనాలను వినియోగించుకోవాలని యజమానులకు, ఉద్యోగులకు వై.డి. శ్రీనివాస్ ఆ ప్రకటనలో సూచించారు.

# 3వ వార్డులో బీఆర్ఎస్ జోరుగా ప్రచారం.!

◆ **డోర్ టు డోర్ కార్యక్రమంలో సండ్ర వెంకట వీరయ్య.**

**సత్తుపల్లి, ఫిబ్రవరి 5 (తెలంగాణ ముచ్చట్లు):**





సత్తుపల్లి మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. పట్టణంలోని 3వ వార్డు బీఆర్ఎస్ అభ్యర్థి కూసంపూడి మాధురి గెలుపు కోసం మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సండ్ర వెంకట వీరయ్య డోర్ టు డోర్ ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుసుకుంటూ కారు గుర్తుకు మద్దతు ఇవ్వాలని కోరారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీఆ ర్ఎస్ ప్రభుత్వ హయాంలో సత్తుపల్లి నియో జకవర్గంలో సీసీ, బీటీ రోడ్లు, 100 పడకల ఆసుపత్రి వంటి కీలక అభివృద్ధి పనులు జరి గాయని తెలిపారు. రైతు బంధు, రైతు బీమా, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, పెరిగిన పెన్షన్లు వంటి సంక్షేమ పథకాలను గుర్తు చేశారు. అలాగే మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల అభ్యర్థులతో సండ్ర వెంకట వీరయ్య ప్రత్యేకంగా చర్చలు జరిపి, ప్రతి వార్డులో నాయకులు, కార్యకర్తలు, ప్రజలు కలిసికట్టుగా పనిచేసి బీఆర్ఎస్ విజయాన్ని సాధించాల్సిన అవసరం ఉందని పిలుపుని చ్చారు. ప్రజలతో కలిసి, ప్రజల మద్దతుతోనే గెలుపు సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# ఫిబ్రవరి 12 దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

◆ **ఆశా వర్కర్ల డిమాండ్ల సాధనకు సమ్మె తప్పనిసరి**

◆ **మల్లాపూర్ యూపిహెచ్‌సీ ఆశా వర్కర్స్ యూనియన్**

**మల్లాపూర్, ఫిబ్రవరి 05 (తెలంగాణ ముచ్చట్లు)**



తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వ ర్యంలో 2026 ఫిబ్రవరి 12న నిర్వహించ నున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని మల్లాపూర్ యూపిహెచ్‌సీ ఆశా వర్కర్స్ యూనియన్ పిలుపునిచ్చింది.ఈ మేరకు మల్లాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా వర్కర్లు సమావేశమై తమ సమస్యలు, డిమాండ్లను చర్చించారు. అనంతరం ఆరోగ్య కేంద్రం డాక్టర్‌కు ఆశా వర్కర్ల డిమాండ్లతో కూడిన మెమొరండాన్ని సమర్పించారు.ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఆశా వర్కర్లపై రోజురోజుకు పనిభారం పెరుగుతున్న ప్పటికీ, తగిన వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజారోగ్య సేవల్లో కీలకమైన పాత్ర పోషిస్తున్న ఆశా వర్కర్లకు కనీస హక్కులు కూడా అందకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు.నాలుగు లేబర్ కోడ్స్‌ను తక్ష ణమే రద్దు చేయాలని, ఆశా వర్కర్లకు కనీస వేతనం నెలకు రూ.26,000/ చెల్లించాలని, రూ.10,000/ పెన్షన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పనిభారాన్ని తగ్గించి, గౌరవప్రదమైన వేతనం, ఉద్యోగ భద్రత, సామాజిక భద్రతా పథకాలు అమలు చేయాలని ప్రభుత్వాలను కోరారు.దేశవ్యాప్తం గా ఆశా వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఫిబ్రవరి 12న జరిగే సమ్మె అవసరమని పేర్కొన్న నాయకులు, ఆశా వర్క ర్లందరూ సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమం లో జిల్లా కమిటీ సభ్యురాలు లతతో పాటు మల్లాపూర్ యూపిహెచ్‌సీ ఆశా వర్కర్స్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

# మూడుచింతలపల్లిలో ఈటల రాజేందర్ ఎన్నికల ప్రచారం

◆ **బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలకు పిలుపు**

**మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా, ఫిబ్రవరి 05 (తెలంగాణ ముచ్చట్లు):**





మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా మూడుచింతలప ల్లి మున్సిపాలిటీ పరిధిలో భారతీయ జనతా పార్టీ ఎన్నికల ప్రచారం ఉత్సాహంగా కొన సాగుతోంది. ఈ సందర్భంగా మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ ఉద్ద మర్రిలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొని ప్రజలనుద్దేశించి ప్రసంగించారు .ఈ సందర్భంగా 21వ వార్డు బీజేపీ అభ్యర్థి పుష్పలత, 8వ వార్డు అభ్యర్థి నాగరాణి, 9వ వార్డు అభ్యర్థి తప్పెట్ల నాగరాణిలను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ఈటల రాజేందర్ మాట్లాడు తూ, "ఇక్కడి ప్రజలు అమ్ముడుపోరు.ఒకవేళ ప్రజలు అమ్ముడుపోయేవారైతే నేను ఎంపీగా గెలిచేవాడిని కాను. అన్ని పార్టీల వారు నాకు ఓటు వేసి గెలిపించారు. నా మీద పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేస్తున్నా ను" అని అన్నారు."ఓటుకు డబ్బులు ఇచ్చిన వారు నిజంగా ప్రజలకు సేవ చేస్తారా? పెట్టిన డబ్బును తిరిగి ఎలా సంపాదించాలా అని మాత్రమే ఆలోచిస్తారు. ప్రజలు ఈ విషయా న్ని గమనించాలి" అని సూచించారు.ప్రజలు చెల్లిస్తున్న పన్నులపై మాట్లాడుతూ, "మద్యం కొనుగోలు చేస్తే రూ.50 వేల కోట్ల ట్యాక్స్, భూముల రిజిస్ట్రేషన్‌లో రూ.25 వేల కోట్ల ట్యాక్స్ ప్రభుత్వం వసూలు చేస్తోంది. కానీ పె న్షన్లకు కేవలం రూ.12 వేల కోట్లు మాత్రమే ఇస్తోంది. అసలు ఎవరు ఎవరికి ఇస్తున్నారు? మనమే అసలైన ఓనర్లు" అని పేర్కొన్నారు.

"ఓటు వేయకపోతే పెన్షన్ ఆగిపోతుంది, ఇల్లు రాదు అని ఎవడైనా బెదిరిస్తే 'నువ్వు ఎవడ్రా?' అని ప్రశ్నించాలి. ఏ పార్టీ అధికా రంలో ఉన్నా సంక్షేమ పథకాలు ఆగవు" అని స్పష్టం చేశారు.

మహిళలకు రూ.2500 ఇస్తామని, పెన్షన్లు పెంచుతామని చెప్పి అమలు చేయని పార్టీల పై ఆయన తీవ్ర విమర్శలు చేశారు.


"డబ్బుల్లేవని చెప్పేవాళ్లు మూడుచింతలప ల్లికి అభివృద్ధి పనులు ఎలా చేస్తారు?" అని ప్రశ్నించారు.

"కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు ఓటు వేయడం అంటే బురద గుంటలో వేసినట్టే. కేంద్ర ప్రభుత్వ సహకారంతో బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమవుతుంది" అని ఆయన అన్నారు.చివరగా ఉద్దమర్రి ప్రజలను ఉద్దే శించి, "మా ముగ్గురు బీజేపీ అభ్యర్థులకు కమలం పువ్వు గుర్తుపై ఓటు వేసి భారతీయ జనతా పార్టీని గెలిపించాలి. ప్రజలు పిలిస్తే పలికే ప్రతినిధులుగా ఉంటాం" అని ఈటల రాజేందర్ విజ్ఞప్తి చేశారు.

# ఉప్పల్ డివిజన్‌కు భారీ అభివృద్ధి నిధులు మంజూరు

◆ **రూ.4.72 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం**

**ఉప్పల్, ఫిబ్రవరి 05 ( తెలంగాణ ముచ్చట్లు):**





ఉప్పల్ డివిజన్‌కు మరోసారి భారీ స్థాయిలో నిధులు మంజూరయ్యాయని ఉప్పల్ కార్పొ రేటర్ మందుముల రజితపరమేశ్వర్ రెడ్డి తెలిపారు. డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో సీసీ రోడ్ల నిర్మాణం, మరమ్మతుల కోసం మొత్తం రూ.4 కోట్ల 72 లక్షల వ్యయంతో పనులు చేప ట్టనున్నట్లు పేర్కొన్నారు.జీహెచ్‌ఎంసీ పరిధిలో ఉప్పల్ డివిజన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో నిరంతరం అభివృద్ధి కార్యక్రమా లు చేపడుతున్నామని రజితపరమేశ్వర్ రెడ్డి అన్నారు. రామంతాపూర్ చర్చి కాలనీ, కేటీఆర్ నగర్, లక్ష్మీనారాయణ కాలనీ, శ్రీరమణ పురం కాలనీల్లో సీసీ రోడ్లు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ ప్రమాదాలకు గురవుతున్న పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని ఈ పనులకు నిధులు మంజూరు చేయించామని తెలిపారు.సీసీ రోడ్ల నిర్మాణానికి మంజూరైన నిధుల వివరాలు:రామంతాపూర్ కేటీఆర్ నగర్‌లో రూ.1 కోటి 15 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం,రామంతాపూర్ శ్రీరమణ పురంలో రూ.1 కోటి 50 లక్షలతో దెబ్బతిన్న సీసీ రోడ్ల ని ర్మాణం,రామంతాపూర్ చర్చి కాలనీలో రూ.1 కోటి 18 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం, లక్ష్మీనారాయణ కాలనీలో రూ.92 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు .ఈ సందర్భంగా మంజూరైన నిధులకు సం బంధించిన ప్రొసీడింగ్స్‌ను ఆయా కాలనీల అసోసియేషన్ ప్రతినిధులకు కార్పొరేటర్ మందుముల రజితపరమేశ్వర్ రెడ్డి, పరమే శ్వర్ రెడ్డి అందజేశారు.ఈ కార్యక్రమంలో రామంతాపూర్ లక్ష్మీనారాయణ కాలనీ, చర్చి కాలనీ, శ్రీరమణ పురం, కేటీఆర్ నగర్ కాలనీల అధ్యక్షులు, కాలనీవాసులు తదితరు లు పాల్గొన్నారు.

# శివరాత్రి సందర్భంగా బ్రహ్మకుమారీస్‌లో శివ బాబా 90వ జన్మదిన వేడుకలు

◆ **ముఖ్య అతిథిగా పాల్గొన్న కార్పొరేటర్ కానం రాజలక్ష్మి**

**వినాయక్ నగర్, ఫిబ్రవరి 05 (తెలంగాణ ముచ్చట్లు):**



రాబోయే మహాశివరాత్రిని పురస్కరించుకుని ఆర్కే నగర్, సఫిల్‌గూడలోని బ్రహ్మకుమారీస్ శాఖలో శివ బాబా 90వ జన్మదిన వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్య క్రమానికి కార్పొరేటర్ కానం రాజలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఆమె బ్రహ్మకుమారీస్ జెండాను ఆవిష్కరించి, కేక్ కట్ చేశారు. అనంతరం మా ట్లాడుతూ, నేటి సమాజంలో శాంతిని కోల్పోతు న్న మానవాళికి ప్రపంచ శాంతి, ఆత్మశాంతిని బోధిస్తూ ప్రచారం చేస్తున్న బ్రహ్మకుమారీస్ సంస్థ ఒక అద్భుతమైన ఆధ్యాత్మిక సంస్థ అని కొ నియాడారు.సఫిల్‌గూడ బ్రహ్మకుమారీస్ శాఖకు చెందిన సిస్టర్ రాజి మానవాళి శ్రేయస్సు కోసం సేవా కార్యక్రమాలతో పాటు బ్రహ్మ కుమారీస్ ఆధ్యాత్మికతను రోజువారీ జీవితంలో ఎలా అనుసరించాలో వి వరిస్తూ ప్రసంగించారు.బ్రహ్మకుమా రీస్ సంస్థ శాంతిని కాపాడటంలో, స్వీయ క్రమశిక్షణను అలవరచుకో వడంలో ఎంతో దోహదపడుతుంద ని, ఈ కార్యక్రమంలో పాల్గొనడం తనకు గర్వకారణమని కార్పొరేటర్ కానం రాజలక్ష్మి తెలిపారు.ఈ కార్య క్రమంలో బికే రామచంద్ర రావు, బాల స్వామి, కృష్ణతో పాటు అనేక మంది రాజయోగ సాధకులు, బ్రహ్మకుమారీస్ భావజాల అనుచరు లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ పేదల పాలిట వరం

**నాచారం, ఫిబ్రవరి 05 (తెలంగాణ ముచ్చట్లు):**



ప్రభుత్వం అందిస్తున్న సీఎం రిలీఫ్ ఫండ్ పేదల జీవితాల్లో ఆశాజ్యోతిగా నిలుస్తోం ది. నాచారం డివిజన్ వీఎస్‌టీ కాలనీకి చెందిన మహమ్మద్ షాహిన్ అనారోగ్య కారణాలతో నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. చికిత్సకు భారీ ఖర్చులు కావడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొం టున్న కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఉపశమనం లభించింది.ఈ విష యాన్ని ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన స్పందించి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.1 లక్ష 20 వేల రూపాయల ఆర్థిక సహాయా న్ని మంజూరు చేయించారు.మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం పేదలు, బాధిత కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

## పీహెచ్‌సీ భూమి కేటాయింపుపై ఎంపీ ఈటల వినతిపత్రం కార్పొరేటర్

**వినాయక నగర్, ఫిబ్రవరి 05 (తెలంగాణ ముచ్చట్లు):**



మల్కాజిగిరి నియోజకవర్గం వినాయక నగర్ డివిజన్ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్‌ను వారి నివాసంలో కలిసి, వినాయకనగర్ డివిజన్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) నిర్మాణానికి సంబంధించి వినతిపత్రం సమర్పించారు.ప్రస్తుతం పీహెచ్‌సీ కోసం కేటాయించిన భూమిలో 30 అడుగుల లోతు వరకు గట్టి మట్టి లేకపోవడంతో నిర్మాణ పనులు చేపట్టడం సాధ్యం కావడం లేదని ఆమె ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. అందువల్ల ప్రత్యామ్నాయంగా అనుకూలమైన భూమిని కేటాయించి పీహెచ్‌సీ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు.అలాగే, మల్కాజ్‌గిరిలోని పాత కోర్టు ప్రాంగణాన్ని పిల్లల ఆటస్థలంగా అభివృద్ధి చేయడానికి ఎంపీ ఈటల రాజేందర్ స్వయంగా జోక్యం చేసుకుని అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ, ఈ సందర్భంగా నేను కూడా ఒక వినతిపత్రాన్ని సమర్పించారు.స్థానిక ప్రజల ఆరోగ్య, పిల్లల సంక్షేమ అవసరాలపై సానుకూలంగా స్పందించిన ఎంపీ ఈటల రాజేందర్, సంబంధిత అధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.



## అంతర్జాతీయ కరాటే పోటీల్లో సత్తా చాటిన విద్యార్థులు

- 'ద బెస్ట్ టీమ్' ట్రోఫీని అందుకున్న కరాటే మాస్టర్ రవికుమార్ గౌడ్

**కుషాయిగూడ, ఫిబ్రవరి 05 (తెలంగాణ ముచ్చట్లు):**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖపట్నంలో శుక్రవారం నిర్వహించిన అంతర్జాతీయ కరాటే పోటీల్లో కుషాయిగూడ, చర్లపల్లి ప్రాంతాలకు చెందిన ఛాంపియన్ షాటోఖాన్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి పతకాల వర్షం కురిపించారు.ఈ పోటీల్లో అకాడమీ విద్యార్థులు కట విభాగంలో నాలుగు బంగారు పతకాలు, రెండు వెండి పతకాలు, మూడు కాంస్య పతకాలు సాధించగా, కుమిటే విభాగంలో ఐదు వెండి పతకాలు, నాలుగు కాంస్య పతకాలు గెలుచుకున్నారు. ఈ విశేష విజయానికి గాను అకాడమీ ఫౌండర్, ప్రెసిడెంట్ కరాటే మాస్టర్ బుడిగే రవికుమార్ గౌడ్‌కు నిర్వాహకులు "ద బెస్ట్ టీమ్" ట్రోఫీని అందజేశారు.కట విభాగంలో శ్రీశాంత్ గౌడ్, విష్ణు, ప్రభావ్, మనస్విని బంగారు పతకాలు సాధించగా, రుద్ర, శ్రీహిత వెండి పతకాలు దక్కించుకున్నారు. అలాగే మనస్విని, శ్రీనిష్, ఉదయశ్రీ కాంస్య పతకాలు సాధించారు. కుమిటే విభాగంలో శ్రీశాంత్ గౌడ్, విష్ణు, శ్రీహిత, ఉదయశ్రీ, రుద్ర వెండి పతకాలు గెలుచుకోగా, శ్రీనిష్, ప్రభావ్, మనస్విని, మనవిశ్రీ కాంస్య పతకాలు సాధించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విశాఖపట్నం వెస్ట్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ పి.జి.వి.ఆర్. నాయుడు, కరాటే ఆర్గనైజేషన్ సెక్రటరీ తాజుద్దీన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కరాటే మాస్టర్ రవికుమార్ గౌడ్‌ను శాలువాతో సత్కరించి మెమొంటో అందజేశారు. అలాగే విజేతలైన విద్యార్థులకు పతకాలు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.



## పట్టా పాస్‌బుక్ లేని రైతులకు యూరియా అందాలి

- యూరియా యాప్ పేరుతో రైతులను ఇబ్బంది పెట్టొద్దు
- ఎల్కతుర్తి బీజేపీ మండల అధ్యక్షుడు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్

**ఎల్కతుర్తి. ఫిబ్రవరి 05 (తెలంగాణ ముచ్చట్లు):**

పట్టా పాస్‌బుక్ లేకుండా వ్యవసాయం చేస్తున్న రైతులు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారని ఎల్కతుర్తి భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ తెలిపారు. ఇప్పటికే యూరియా కొరతతో ఇబ్బంది పడుతున్న రైతులకు ప్రభుత్వం అమలు చేస్తున్న యూరియా యాప్ మరో భారంగా మారిందని విమర్శించారు.

గురువారం ఎల్కతుర్తి మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పట్టా పాస్‌బుక్ లేని రైతులను పరిగణనలోకి తీసుకోకుండా యూరియా పంపిణీలో నిబంధనలు విధించడం అన్యాయమని అన్నారు. యూరియా యాప్‌లో సాంకేతిక లోపాల వల్ల నమోదు ప్రక్రియ సజావుగా సాగక రైతులు సహకార కేంద్రాల చుట్టూ గంటల తరబడి తిరగాల్సి వస్తోందని తెలిపారు.

పట్టా ఉన్నా లేకపోయినా పంటలు పండించే ప్రతి రైతుకూ ఎలాంటి అడ్డంకులు లేకుండా సకాలంలో యూరియా సరఫరా చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో రైతుల వివరాలు నమోదు చేసి, పాస్‌బుక్ లేని రైతులకు కూడా యూరియా అందేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు.

పంట వేసే కీలక సమయంలో ఎరువులు అందకపోతే రైతులకు తీవ్ర నష్టం జరుగుతుందని, ఇందుకు పూర్తి బాధ్యత ప్రభుత్వానిదేనని ఆయన హెచ్చరించారు. రైతుల సమస్యలు వెంటనే పరిష్కరించకపోతే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని స్పష్టం చేశారు.

## డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల విషయంలో ప్రభుత్వ వైఫల్యం

- ఎంపీ ఈటల రాజేందర్ ఆగ్రహం

**మారేడుపల్లి, ఫిబ్రవరి 05 (తెలంగాణ ముచ్చట్లు):**





మారేడుపల్లి ప్రాంతంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపులో జరుగుతున్న తీవ్ర జాప్యానికి నిరసనగా చేపట్టిన ధర్నాకు మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ మద్దతు తెలిపారు. మొండామార్కెట్ డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపికా నరేష్ఆధ్వర్యంలో జరిగిన ఈ ధర్నాలో పాల్గొన్న ఆయన ప్రభుత్వ తీరుపై తీవ్ర విమర్శలు గుప్పించారు.ఈ సందర్భంగా ఎంపీ ఈటల మాట్లాడుతూ, ప్రభుత్వ చేతకాని తనం వల్ల సంవత్సరంన్నర కాలంగా పేదలకు ఇళ్లు ఇవ్వలేకపోతున్నారని అన్నారు. ఒక ఎంపీగా ఈ పరిస్థితిని చూసి సిగ్గుతో తలదించుకుంటున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ఈ ప్రభుత్వానికి సిగ్గుచేటు అని వ్యాఖ్యానించారు. ఇది మొద్దు ప్రభుత్వం, దుర్మార్గమైన ప్రభుత్వం అంటూ మండిపడ్డారు. ప్రజల జీవితాలతో ఆడుకునే వారు, పేదల కన్నీళ్లను చూసే వారు ఎప్పటికీ బాగుపడరని హెచ్చరించారు. ప్రజలంటే, ప్రజాప్రతినిధులంటే ప్రభుత్వానికి గౌరవం లేదని, ప్రతి ఒక్కరూ తాము మోనార్కుల్లా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.2017లో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణం పూర్తయినా ఇప్పటికీ పేదలకు కేటాయించకపోవడం దారుణమన్నారు. ఎన్నిసార్లు కలెక్టర్‌ను, శాఖ మంత్రిని, ఇంచార్జ్ మంత్రిని కోరినా ఎలాంటి స్పందన లేదని తెలిపారు. ఒక ఎంపీగా కలెక్టర్ కార్యాలయంలో కూడా ధర్నా చేసినప్పటికీ ఇచ్చిన హామీలు అమలు కాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.కేంద్ర ప్రభుత్వం రెండున్నర లక్షల ఇళ్లు మంజూరు చేసినా వాటిని సక్రమంగా నిర్మించి పేదలకు ఇవ్వడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఈటల రాజేందర్ అన్నారు. కట్టిన ఇళ్లలో కూడా కనీస సదుపాయాలు లేవని విమర్శించారు.ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నామని, వెంటనే బాధితులకు ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఈ ప్రభుత్వానికి పర్యవసానం తప్పదని హెచ్చరించారు. తాను ప్రభుత్వ పెద్దలతో మాట్లాడతానని, వారు స్పందించకపోతే తదుపరి కార్యాచరణను నిర్ణయిస్తామని తెలిపారు.ఈ ధర్నాలో మేడ్చల్ అర్బన్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు మల్లారెడ్డి, కంటోన్మెంట్ బోర్డు సభ్యురాలు నర్మద మల్లికార్జున్, మొండామార్కెట్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు జితేందర్ గుప్తా, కంటోన్మెంట్ అసెంబ్లీ కన్వీనర్ విజయ్ ఆనంద్, బీజేపీ సీనియర్ నాయకులు వీకే మహేష్, పిట్ల నగేష్, కిరణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మౌలిక వసతులే మా లక్ష్యం.!

- 20 వార్డులో కమల్ పాషా
- 22 వార్డులోఎండి. రెహనా కమల్ పాషా ముమ్మర ప్రచారం

**సత్తుపల్లి, ఫిబ్రవరి 5 (తెలంగాణ ముచ్చట్లు):**





సత్తుపల్లి మున్సిపాలిటీ అభివృద్ధిని లక్ష్యంగా చేసుకుని కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులు కమల్ పాషా, ఎండి. రెహనా కమల్ పాషా ఇంటింటి ప్రచారంతో ప్రజల్లోకి వెళ్తున్నారు. ముఖ్యంగా 20, 22 వార్డుల్లో మౌలిక వసతుల కల్పననే ప్రధాన అజెండాగా తీసుకుని ఓటర్లను ఆకట్టుకుంటున్నారు.

20వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి కమల్ పాషా గురువారం వార్డులో విస్తృతంగా పర్యటించారు. సీసీ రోడ్ల నిర్మాణం, సైడ్ డ్రైనేజీల ఏర్పాటు, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. అర్హులైన ప్రతి పేదవాడికి రేషన్ కార్డులు, ఇళ్లు, ఇళ్ల స్థలాల మంజూరుకు కృషి చేస్తానని తెలిపారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ స్థానిక సమస్యల పరిష్కారానికి తన వంతు బాధ్యతగా పనిచేస్తానని పేర్కొన్నారు. వార్డులో విద్యుత్ సమస్యలను గుర్తించి, తన సొంత ఖర్చులతో ఎలక్ట్రిక్ పోల్స్ ఏర్పాటు చేయించడం ద్వారా సేవాభావాన్ని చాటుకున్నారని స్థానికులు పేర్కొన్నారు.

22వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి ఎండి. రెహనా కమల్ పాషా మహిళలు, యువతతో కలిసి ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. 22వ వార్డును అభివృద్ధిలో ముందంజలో నిలిపి, ఒక ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలు, అవసరాలను అడిగి తెలుసుకున్నారు. వార్డు పరిస్థితులపై పూర్తి అవగాహన, స్థానిక కుటుంబ నేపథ్యం తనకు బలంగా మారుతుందని తెలిపారు. కోవిడ్ కష్టకాలంలో అనేకమందికి ఆర్థిక సహాయం అందించడంతో పాటు, ఆసుపత్రుల్లో చికిత్సలు చేయించి ప్రాణదాతగా నిలిచిన కమల్ పాషా సేవలను ప్రజలు గుర్తుచేసుకుంటున్నారు.

ఈ కార్యక్రమంలో ఆలవాల కరుణాకర్, రాయల కోటేశ్వరరావు, జూపాటి పాపారావు, ప్రణతి వెంకటేశ్వరరావు, కొత్తపల్లి శివ, గజ్జల శీను, సంపత్, యూనిస్ తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 11న జరగనున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో "హస్తం" గుర్తుపై ఓటు వేసి కాంగ్రెస్ పార్టీకి ఘన విజయాన్ని అందించాలని అభ్యర్థులు ప్రజలను కోరారు.

## యువతి అడ్వకేట్ స్వప్న హత్యపై బార్ అసోసియేషన్ల ఆగ్రహం

- కుషాయిగూడలో ర్యాలీ – డీజీపీకి చర్యలు తీసుకోవాలని డిమాండ్

**కుషాయిగూడ, ఫిబ్రవరి 05 (తెలంగాణ ముచ్చట్లు):**





రంగారెడ్డి జిల్లా చేవెళ్ల బార్ అసోసియేషన్‌కు చెందిన యువతి అడ్వకేట్ కుమారి స్వప్న దారుణ హత్యను తెలంగాణ రాష్ట్ర బార్ అసోసియేషన్ల సమాఖ్య తీవ్రంగా ఖండించింది. ఈ ఘటనపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బార్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో కుషాయిగూడలో భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు.ఉదయం 11.00 గంటలకు కుషాయిగూడ కోర్టు నుంచి ఈసీఐఎల్ అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యనిర్వాహక కమిటీ సభ్యులు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తూ, ఈ కేసులో డీజీపీ స్థాయిలో జోక్యం చేసుకొని న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.ర్యాలీ అనంతరం కుషాయిగూడ ఏసిపికి వినతిపత్రం అందజేశారు. అలాగే ఈ ఘటనపై డీజీపీ దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ, కుషాయిగూడ సీఐ భాస్కర్ రెడ్డికి కూడా వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ల సమాఖ్య నాయకులు మాట్లాడుతూ, ఈ హత్య న్యాయవృత్తికి, న్యాయవ్యవస్థకు తీవ్ర మచ్చగా పేర్కొన్నారు. హత్యకు పాల్పడిన నిందితులందరినీ వెంటనే గుర్తించి అరెస్టు చేయాలని, వేగవంతంగా దర్యాప్తు పూర్తి చేసి ఈ కేసును ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.అడ్వకేట్ స్వప్న తన ప్రాణాలకు ముప్పు ఉందని గతంలో పలుమార్లు పోలీసులను ఆశ్రయించినప్పటికీ, ఆమె ఫిర్యాదులను సరైన రీతిలో పరిగణలోకి తీసుకోలేదనే అనుమానాలు ఉన్నాయని వారు తెలిపారు. ఈ అంశంపై సమగ్ర విచారణ జరిపి, నిర్లక్ష్యానికి పాల్పడిన అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.సత్వర పోలీసు చర్యలు, వేగవంతమైన న్యాయ ప్రక్రియ ద్వారానే న్యాయవ్యవస్థపై న్యాయవాదులు మరియు ప్రజల విశ్వాసం నిలబడుతుందని బార్ అసోసియేషన్ల సమాఖ్య నాయకులు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర బార్ అసోసియేషన్ల సమాఖ్య అధ్యక్షులు ఎన్. అమరేందర్ రెడ్డి, కార్యదర్శి బాపిరెడ్డి, జాయింట్ సెక్రటరీ ధనలక్ష్మి, లైబ్రరీ సెక్రటరీ వెంకటేష్, ఖజానాదారు మురళి, లేడీ సెక్రటరీ రేణుక తదితరులు పాల్గొన్నారు.

## రూ.20 కోట్లతో ఉప్పల్ నల్ల చెరువు అభివృద్ధి

- హైడ్రా కమిషనర్‌తో కలిసి చెరువును పరిశీలించిన కార్పొరేటర్ రజితాపరమేశ్వర్ రెడ్డి

**ఉప్పల్, ఫిబ్రవరి 05 (తెలంగాణ ముచ్చట్లు)**





ఉప్పల్ నల్ల చెరువును రూ.20 కోట్లతో పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి సుందరీకరించనున్నట్లు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. గురువారం ఆయన ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి, ఉప్పల్ కార్పొరేటర్ మందుముల రజితపరమేశ్వర్ రెడ్డితో కలిసి నల్ల చెరువును సందర్శించారు.ఈ సందర్భంగా చెరువులో చేపడుతున్న అభివృద్ధి, సుందరీకరణ పనులను కమిషనర్ పరిశీలించి, పనులు నాణ్యతతో పాటు సకాలంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. నల్ల చెరువును ప్రజలకు విశ్రాంతి, వినోద కేంద్రంగా తీర్చిదిద్దడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు అనుగుణంగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు.చెరువు పరిసర ప్రాంతాల్లో ఉన్న అక్రమ కబ్జాలను త్వరలోనే తొలగించనున్నట్లు కమిషనర్ రంగనాథ్ స్పష్టం చేశారు. నల్ల చెరువు అభివృద్ధి పూర్తయితే ఉప్పల్ ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా మారుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఈగ అంజయ్య ముదిరాజ్, లింగంపల్లి రామకృష్ణ, తుమ్మల దేవిరెడ్డి, అలుగుల అనీల్ కుమార్, మంద మురళి కృష్ణ రెడ్డి, జనగాం రామకృష్ణ, సుంకు శేఖర్ రెడ్డి, గొరిగె మహేష్, అల్వాల భాస్కర్, ప్రేమ్, మహంకాళి రాజు, రమణ, ప్రతాప్ రెడ్డి, రామ్ రెడ్డి, బసిరెడ్డి, నల్లవెల్లి మహేందర్, తుమ్మల రాజేందర్ రెడ్డి, ఢిల్లీ చంద్రశేఖర్ రెడ్డి, కాటపల్లి విజయకుమార్, సిఎస్ నరేష్, రంగుల శేఖర్ ముదిరాజ్, ప్రశాంత్ రెడ్డి, సత్యం, పిలకల రామ్ రెడ్డి, ఎండీ ఆఫ్జల్, మోహన్, మోహన్ నాయక్, చింతకింది శ్రీనివాస్, శివ గౌడ్, రవి, హరీష్ రెడ్డి, బచ్చారాం తదితరులు పాల్గొన్నారు.

## కీసరగుట్ట జాతర జిల్లా స్థాయి క్రీడోత్సవాలు

- 2026 ఫిబ్రవరి 13 నుంచి 18 వరకు నిర్వహణ

**కీసర, ఫిబ్రవరి 05 (తెలంగాణ ముచ్చట్లు):**

మేడ్చల్-మల్కాజిరి జిల్లా పరిధిలో కీసరగుట్ట బ్రహ్మోత్సవాల జాతరను పురస్కరించుకుని జిల్లా స్థాయి క్రీడోత్సవాలు-2026ను ఈ నెల ఫిబ్రవరి 13 నుంచి 18 వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కీసరగుట్ట దేవాలయ శాఖ, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ క్రీడోత్సవాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.ఈ క్రీడోత్సవాలు మేడ్చల్-మల్కాజిరి జిల్లాలోని పాఠశాల విద్యార్థులు మరియు యువతకు క్రీడా ప్రతిభను వెలికితీసే ఉద్దేశంతో ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

పాఠశాల క్రీడోత్సవాలు (బాలురు & బాలికలు):తేదీలు: ఫిబ్రవరి 13, 14,క్రీడలు: కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్ .యువత క్రీడోత్సవాలు (బాలురు):తేదీలు: ఫిబ్రవరి 17, 18,క్రీడలు: కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్ ,మేడ్చల్-మల్కాజిరి జిల్లాలోని అన్ని పాఠశాలలు, క్రీడాకారులు మరియు యువజనులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ క్రీడోత్సవాలను విజయవంతం చేయాలని జిల్లా యువజన మరియు క్రీడల అధికారి వై. దామోధర్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి ఐ. విజయ కుమారి, కీసరగుట్ట దేవాలయ చైర్మన్ టి. వెంకటేష్, దేవాలయ కమిటీ సభ్యులు మరియు ఎస్టీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ బి. కిష్టయ్య పిలుపునిచ్చారు. రిజిస్ట్రేషన్ వివరాలు:చివరి తేదీ: ఫిబ్రవరి 11 సాయంత్రం 5 గంటల వరకు.స్థలం: ఎంఆర్సి, కీసర .ఆలస్యంగా వచ్చే దరఖాస్తులను స్వీకరించబోమని నిర్వాహకులు స్పష్టం చేశారు.డ్రా వివరాలు:తేదీ: ఫిబ్రవరి 12 సమయం: ఉదయం 11 గంటలకు.స్థలం:ఎంఆర్సి, కీసర పూర్తి వివరాలకు సంప్రదించండి: బి. కిష్టయ్య ఎస్టీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ, మేడ్చల్-మల్కాజిరి జిల్లా ఫోన్ నెంబర్ 94418 12050

# పేదోడి ఇల్లు కంటే 'కాళేశ్వరం' కమిషన్లే ముఖ్యం అనుకున్నారు..!

- గత పాలకులపై అశ్వారావుపేట మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో మంత్రి పొంగులేటి నిప్పులు

ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 5 (తెలంగాణ ముచ్చట్లు)




మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా అశ్వారావుపేటలో గురువారం నిర్వహించిన భారీ రోడ్ షోలో తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రతిపక్షాలపై విమర్శనాస్త్రాలు సంధించారు. గత పదేళ్ల పాలనలో పేదవాడి సొంతింటి కలను కేసీఆర్ ప్రభుత్వం తుంగలో తొక్కిందని, కమిషన్ల కోసమే ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇచ్చారని ఆయన మండిపడ్డారు.

**కమిషన్ల కక్కుర్తితోనే ఇళ్ల నిర్మాణం నిర్లక్ష్యం!**

ప్రచార సభల్లో మంత్రి మాట్లాడుతూ... "గత పాలకులు పేదవాడి ఆత్మగౌరవమైన ఇల్లు కట్టించడం కంటే, తమ జేబులు నింపుకోవడానికే మొగ్గు చూపారు. పేదవాడికి ఇల్లు కట్టిస్తే కమిషన్లు రావని, లక్షల కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా వచ్చే వేల కోట్ల కమిషన్ల కోసమే ప్రాధాన్యత ఇచ్చారు" అని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోనే 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసిందని, అందులో అశ్వారావుపేటకే 4,500 ఇళ్లు కేటాయించినట్లు గుర్తుచేశారు.

**దొరల పాలన వర్సెస్ పేదల పాలన**

నాడు వరి వేస్తే ఉరే అన్న దొరల పాలన చూశాం.. నేడు రైతును రాజును చేస్తున్న ఇందిరమ్మ పాలన చూస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. గత ప్రభుత్వం రైతులకు బేడీలు వేస్తే, తాము అధికారంలోకి వచ్చిన 9 నెలల్లోనే 21 వేల కోట్ల రూపాయల రుణమాఫీ చేసి చిత్తశుద్ధిని నిరూపించుకున్నామన్నారు.

**ప్రతిపక్షాలకు డిపాజిట్లు కూడా దక్కవు!**

అశ్వారావుపేట అభివృద్ధిని విస్మరించిన వారికి ఈ ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమని మంత్రి హెచ్చరించారు. రూ. 230 కోట్లతో నియోజకవర్గాన్ని మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతున్నామని హామీ ఇచ్చారు. సర్వే నంబర్ 911, 1228 వంటి దశాబ్దాల నాటి భూ సమస్యలను పరిష్కరించే బాధ్యత రెవెన్యూ మంత్రిగా తానే స్వయంగా తీసుకుంటానని హామీ ఇచ్చారు.

**మొన్నటి ఫలితాలే రిపీట్ అవుతాయి...**

అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రానికే 'తీపి కబురు' అందించిన అశ్వారావుపేట, ఇప్పుడు మున్సిపల్ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ ప్రభంజనానికి నాంది పలకబోతోందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అభ్యర్థులను, మిత్రపక్షమైన సీపీఐ(ఎం) అభ్యర్థిని అత్యధిక మెజారిటీతో గెలిపించి, ప్రతిపక్షాలకు రాజకీయ సమాధి కట్టాలని పిలుపునిచ్చారు.

# మున్సిపాలిటీల్లో ఓటరు సౌకర్య కేంద్రాల ఏర్పాటు

- జిల్లా కలెక్టర్ మను చౌదరి

మేడ్చల్–మల్కాజ్‌గిరి, ఫిబ్రవరి 05 (తెలంగాణ ముచ్చట్లు):

2026 రెండో సాధారణ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా పరిధిలోని మున్సిపాలిటీల్లో ఓటరు సౌకర్య కేంద్రాలు (ఓటర్ల సహాయ కేంద్రాలు - వివిఎఫ్‌సిలు) ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ మను చౌదరి తెలిపారు. ఈ కేంద్రాలను ఫిబ్రవరి 07 మరియు 08 తేదీల్లో ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లాలోని ఎల్లంపేట్, అలియాబాద్, మూడుచింతలపల్లి మున్సిపాలిటీల పరిధిలో ఓటు హక్కు కలిగి ఉండి ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు, పోలీసు సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఈ సౌకర్య కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.మున్సిపల్ కార్యాలయాల్లో ఏర్పాటు చేయనున్న ఈ కేంద్రాలు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు పనిచేస్తాయని తెలిపారు. ఈ కేంద్రాల్లో ఓటరు జాబితాలో పేరు ఉన్నదీ లేనిదీ ధృవీకరణ, పోలింగ్ స్టేషన్ వివరాల గుర్తింపు, ఓటర్ స్లిప్‌లపై మార్గదర్శనం, ఎన్నికల ప్రక్రియపై అవగాహన కల్పించడం జరుగుతుందని పేర్కొన్నారు. అదేవిధంగా ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులు, ఉద్యోగులు, పోలీసు సిబ్బంది తమ ఓటు హక్కును అక్కడికక్కడే వినియోగించుకునే అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు.నిర్దేశిత సమయాల్లో ఓటరు సౌకర్య కేంద్రాలు సక్రమంగా పనిచేయునట్లు చూడాలని, ఓటర్లలో అవగాహన కల్పించేందుకు మున్సిపల్ పరిధిలో విస్తృత ప్రచారం నిర్వహించాలని అన్ని మున్సిపల్ కమిషనర్లను కలెక్టర్ ఆదేశించారు. అలాగే గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు, పోటీ చేస్తున్న అభ్యర్థులు కూడా ఈ విషయాన్ని ఓటర్ల సౌకర్యార్థం విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు.ఫిబ్రవరి 07 (శనివారం) న ఎన్నికల విధులు నిర్వహిస్తున్న అధికారులు, ఉద్యోగులు, పోలీసు సిబ్బందికి ప్రత్యేక సాధారణ సెలవు (ప్రత్యేక సాధారణ సెలవు) వర్తింపజేయాలని, ఆ రోజు ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు ఓటరు సౌకర్య కేంద్రాల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

# వైరా మున్సిపాలిటీలో కదం తొక్కిన గులాబీ దళం

**నామ–పువ్వాడ–తాత మధు రోడ్ షో కు భారీ స్పందన**

ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 5(తెలంగాణ ముచ్చట్లు)




వైరా మున్సిపాలిటీ ఎన్నికల్లో బీఆర్ఎస్, సీపీఎం అభ్యర్థులు విజయాన్ని కాంక్షిస్తూ గురువారం బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు, వైరా మున్సిపాలిటీ ఎన్నికల ఇంచార్జి, మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ తాత మధుసూదన్ ఆధ్వర్యంలో జరిగిన రోడ్ షో కు భారీ స్పందన లభించింది. అధిక సంఖ్య లో నాయకులు, కార్యకర్తలు పాల్గొని రోడ్ షో ను విజయవంతం చేసారు. ఈ సందర్భంగా ముందుగా వైరా ఎస్టీ కాలనీలోని శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయంలో శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, వేద పండితుల ఆశీర్వచనాలు స్వీకరించారు. అనంతరం పట్టణంలోని వివిధ వార్డుల్లో పర్యటించి ప్రజలతో మమేకమై ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ చైర్మన్ అభ్యర్థి కట్టా స్వరూప రాణి, బీఆర్ఎస్ మూడవ వార్డ్ అభ్యర్థి కారుకొండ బోసు, తొమ్మిదవ వార్డ్ సీపీఎం అభ్యర్థి గుడిమెట్ల రజితలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఆయా వార్డుల్లో బీఆర్ఎస్, సీపీఎం నాయకులు, కార్యకర్తలతో కలిసి రోడ్ షో నిర్వహించి ఇంటింటా ప్రచారం చేపట్టారు. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు తెలియజేస్తూ "కాంగ్రెస్ బాకీ కార్డు"లను ఇంటింటికి పంపిణీ చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఈ సందర్భంగా వారు విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు గుర్తు చేస్తూ మరోసారి బీఆర్ఎస్‌కు అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైరా మాజీ శాసన సభ్యురాలు శ్రీమతి బానోత్ చంద్రావతి, సీపీఎం పార్టీ డివిజన్ సెక్రటరీ వీరభద్రం, రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, నియోజకవర్గ నాయకురాలు బానోత్ మంజుల, బీఆర్ఎస్ పార్టీ నాయకులు లకావత్ గిరిబాబు, వైరా రూరల్, పట్టణ అధ్యక్షులు బాణాల వెంకటేశ్వర్లు, సురేష్, మాజీ ఎంపీపీ కట్టా కృష్ణార్జునరావు, వనమా వీశ్వేశ్వరరావు, బీఆర్ఎస్ ఖమ్మం కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ కర్నాటి కృష్ణ, సుడా మాజీ చైర్మన్ బచ్చు విజయ్ కుమార్, రఘునాథపాలెం మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు వీరునాయక్, బీఆర్ఎస్ నాయకులు మోరంపూడి ప్రసాద్ రావు, ముత్యాల వెంకట అప్పారావు, షేక్ లాల్ మొహమ్మద్, పట్టణ మహిళా అధ్యక్షురాలు బానోత్ సక్కుబాయి, నాయకులు ఎదునూరి శ్రీను, వాకదాని కోటేశ్వరరావు, మాజీ కౌన్సిలర్లు, వైరా పట్టణ, రూరల్ మండల నాయకులు, కార్యకర్తలు, యువజన విభాగం నాయకులు గొల్లపూడి హరికృష్ణ, మోరంపూడి సాయి, చీకటి రాంబాబు, కృష్ణ ప్రసాద్, సద్దాం, విజయ్ తదితరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



# జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పటిష్టమైన చర్యలు

- అడిషనల్ డీసీపీ

ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 5 (తెలంగాణ ముచ్చట్లు)

మహాశివరాత్రి సందర్భంగా తీర్థాల జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అధికారుల సమన్వయంతో పటిష్టమైన చర్యలు చేపట్టిందని అడిషనల్ డీసీపీ (లా&ఆర్డర్) ప్రసాద్ రావు అన్నారు.

పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు గురువారం ఖమ్మం రూరల్ మండలంలోని తీర్థాల సంగమేశ్వర స్వామి ఆలయాన్ని రూరల్ ఏసీపీ, ఆర్టీసీ, ఆలయ కమిటీ, ఆలయ ఈవో తో కలసి అడిషనల్ డీసీపీ సందర్శించారు. జాతరకు భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుడా చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులకు సూచించారు. నిర్వహకులు ఆలయ స్వాగత ద్వారం మొదలుకొని గర్భాలయం వరకు క్యూలైన్లు, చలువ పందిళ్లు, పరిసరాలు తిరిగి పరిశీలించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు, పార్కింగ్, ఆర్టీసీ బస్ స్టాప్, తదితర ప్రాంతాల దగ్గర బారికేట్ల ఏర్పాటు పరిశీలించి తగిన సూచనలు చేశారు. వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. స్నానపు ఘాట్ , ఇతర ప్రాంతాలలో నిరంతర విద్యుత్ కోసం ట్రాన్స్‌ఫార్మర్లు, జనరేటర్లు, అగ్నిమాపక సిబ్బంది అందుబాటులో ఉండేవిధంగా అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. భక్తుల వాహనాల పార్కింగ్ కోసం కేటాయించిన స్థలంలో వాహనాలు నిలిపే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి,ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

# స్వతంత్రుల ముసుగులో వస్తే నమ్మకండి!

- అధికారం లేని ప్రత్యర్థులతో అభివృద్ధి సాధ్యమా?
- 'శీనన్న మనిషిని' అని చెప్పకుంటే బుద్ధి చెప్పండి
- అధికారం మనది.. అభివృద్ధి చేసేది మనమే : మంత్రి పొంగులేటి

ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 5(తెలంగాణ ముచ్చట్లు)





"ఎన్నికల వేళ స్వతంత్రుల ముసుగులో వచ్చే కొత్త అవతారాలను నమ్మవద్దు.. 'నాకు శీనన్న తెలుసు, ఆయనకు నేను సన్నిహితుడిని' అంటూ మీ ముందుకు వచ్చే వారు ఎవరికీ దగ్గర కాదు" అని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు.

కొత్తగూడెం కార్పొరేషన్ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం పలు డివిజన్లలో నిర్వహించిన రోడ్ షోలలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. రాజకీయ లబ్ధి కోసం సొంత మనుషులమని చెప్పుకునే వారి పట్ల కార్యకర్తలు, ఓటర్లు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

**అధికారం లేని వారికి ఓటెందుకు?**

ప్రతిపక్షాల తీరును ఎండగడుతూ.. "ప్రభుత్వం మనది, అధికారం మనది. అభివృద్ధి చేసే సత్తా కూడా మనకే ఉంది.

కనీసం అధికారం చేతిలో లేని ప్రత్యర్థులు ప్రజలకు ఏం చేస్తారు? వారు ఏ విధంగా అభివృద్ధిని తీసుకువస్తారు?" అని అన్నారు. అభివృద్ధి చేయాలన్నా, నిధులు తేవాలన్నా అది అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వానికే సాధ్యమని స్పష్టం చేశారు.

**ఇండ్లు ఇచ్చేది నేనే.. పట్టాలు ఇచ్చేది నేనే!**

గృహ నిర్మాణం, రెవెన్యూ శాఖలు తన వద్దే ఉన్నాయని గుర్తు చేస్తూ, ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇచ్చే అధికారం తనకు ఉందని పొంగులేటి పేర్కొన్నారు. ఏప్రిల్ నుంచి మరో విడత ఇందిరమ్మ ఇండ్ల మంజూరు ప్రారంభిస్తామని, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అధికారం మన దగ్గర ఉన్నప్పుడు ప్రత్యర్థుల మాటలకు తావులేదని కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు.

**సైనికుల్లా కదలండి..**

కాంగ్రెస్ సీపీఎం కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని పిలుపునిచ్చారు. ఒక్కో కార్యకర్త రేవంత్ రెడ్డిలా, పొంగులేటిలా మారి విపక్షాల కుట్రలను తిప్పికొట్టాలని కోరారు. స్వతంత్రుల ముసుగులో వస్తున్న మోసకారి శక్తులకు ఈ నెల 11న జరిగే ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పి, కొత్తగూడెంపై హస్తం జెండా ఎగురవేయాలని మంత్రి పిలుపునిచ్చారు.



# శక్తిసాయి నగర్ డివిజన్‌లో ఏఈ తో కలిసి విస్తృత బస్తీబాట కార్యక్రమం

- కాంగ్రెస్ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్

మల్లాపూర్, ఫిబ్రవరి 05 (తెలంగాణ ముచ్చట్లు):



ఉప్పల్ నియోజకవర్గం నాచారం సర్కిల్ శక్తిసాయి నగర్ డివిజన్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వీలైనంత త్వరగా పరిష్కరించడమే తమ ప్రధాన లక్ష్యమని కాంగ్రెస్ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్ తెలిపారు. శక్తిసాయి నగర్ డివిజన్‌లో ఏఈ స్పందనతో కలిసి కాలనీలలో విస్తృత పర్యటన నిర్వహించారు.శక్తిసాయి నగర్ డివిజన్ పరిధిలోని బ్రహ్మపురి కాలనీ, మీనా నగర్ ప్రాంతాల్లో గత కొన్ని నెలలుగా కొనసాగుతున్న రోడ్డు, డ్రైనేజీ సమస్యలపై కాలనీ పెద్దలతో కలిసి నెమలి అనిల్ కుమార్ 'బస్తీబాట' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికుల నుంచి సమస్యలను తెలుసుకొని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.ఈ పర్యటనలో స్పందించిన మల్లాపూర్ ఏఈ స్పందనతో పాటు ఆయన బృందం కాలనీల్లో పర్యటించి సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించారు. రోడ్డు, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేసి, త్వరలోనే పనులు చేపడతామని అధికారులు కాలనీ వాసులకు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కాలనీ వాసులతో పాటు నాయకులు పి. వీరస్వామి, కోయలకొండ రాజేష్, విజయ్ రెడ్డి, అన్వర్, రామ్మూర్తి గౌడ్, ప్రతాప్ రెడ్డి, సాయి తదితరులు పాల్గొన్నారు.

# పట్టణాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

**ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**



వనపర్తి పట్టణంలో మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వనపర్తి పట్టణంలోని 12వ వార్డు రాజనగరం, 11వ వార్డుల్లో ఆయన పర్యటించి కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులకు మద్దతుగా ఓట్లను అభ్యర్థించారు.12వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి నక్క రాణి రాజు, 11వ వార్డు అభ్యర్థి తులసి తిరుపతయాదవ్‌లను అఖండ మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే ప్రజలను కోరారు. ప్రచారానికి వచ్చిన ఎమ్మెల్యేకు ఆయా వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు డప్పు వాయిద్యాలు, మంగళహారతులు, కుంకుమ తిలకం, పూల వర్షంతో ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ...పట్టణాల అభివృద్ధి అధికార కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని స్పష్టం చేశారు. వనపర్తిలో ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ నుంచే ఉన్నారని, రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి, ఎంపీగా డా. మల్లురవి ఉన్నారని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో కౌన్సిలర్లుగా కూడా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులే గెలిస్తే వాడ వాడన వేగవంతమైన అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు.ప్రస్తుతం రాష్ట్రంలో మూడు సంవత్సరాలు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటుందని, రానున్న ఐదు సంవత్సరాలు కలుపుకుని మొత్తం ఎనిమిది సంవత్సరాల పాటు కాంగ్రెస్ పాలన కొనసాగనుందని తెలిపారు. కాబట్టి అధికార పార్టీకి ఓటేస్తేనే అభివృద్ధి ఫలాలు నేరుగా ప్రజలకు అందుతాయని అన్నారు.ప్రతిపక్ష పార్టీలకు ఓటు వేసినా ఎలాంటి ప్రయోజనం ఉండదని ప్రజలు గమనించాలని సూచించారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో వార్డులలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని, కేవలం కమిషన్ల కోసం చెరువుల కట్టల పేరుతో ప్రజాధనాన్ని దోచుకున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన కేవలం రెండు సంవత్సరాలలోనే గణనీయమైన అభివృద్ధి పనులు చేపట్టిందన్నారు. వనపర్తి పట్టణంలోని 33 వార్డులలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి దాదాపు రూ.100 కోట్ల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణం, డ్రైనేజీల ఏర్పాటు, కాలనీల విద్యుద్దీకరణ, హైమాస్ట్ లైట్ల ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ మున్సిపల్ ఎన్నికల్లో 33 వార్డుల్లో పోటీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులందరూ విజయం సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు, పార్టీ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

# నేడు ఏదులాపురంలో మంత్రి పొంగులేటి రోడ్ షో

- మధ్యాహ్నం 3.30 గంటల నుంచి 1, 21, 19,18, 31, 32, 17వ వార్డుల్లో పర్యటన

**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 5 (తెలంగాణ ముచ్చట్లు)**

మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం ఏదులాపురం మున్సిపాలిటీలో రోడ్ షో నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 03.30 గంటల నుంచి 1వ వార్డు (రెడ్డి పల్లి), సాయంత్రం 04.00 గంటలకు 21వ వార్డు (ముత్తగూడెం), 04.30 గంటలకు 19వ వార్డు (గొల్లగూడెం), 05.00గంటలకు 18వ వార్డు (బారుగూడెం), 05.30గంటలకు 31,32వ వార్డులు (ఏదులాపురం), 06.30గంటలకు 17వ వార్డు (మద్దులపల్లి)లో ఆయన విస్తృతంగా పర్యటించనున్నారు. ఆయా వార్డుల ప్రధాన కూడళ్లలో జరిగే రోడ్ షోల ద్వారా అభ్యర్థుల విజయానికి మద్దతుగా ఆయన ప్రసంగించనున్నారు. ఈ మేరకు మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్ చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. అభ్యర్థులు, పార్టీ శ్రేణులు, వార్డు ఇన్ చార్జిలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

# అంతర్జాతీయ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన భావన దేవికి ఎమ్మెల్యే అభినందన

**ఏ ఎస్ రావు నగర్, ఫిబ్రవరి 05 (తెలంగాణ ముచ్చట్లు):**



ఈ నెల 13వ తేదీ నుంచి 19వ తేదీ వరకు ఇండోనేషియా దేశంలోని బాలీ నగరంలో జరగనున్న ఇండో-ఇండోనేషియా బాల్ బ్యాడ్మింటన్ సిరీస్‌కు భారత జట్టులో ఎంపికైన డా. ఏ ఎస్ రావు నగర్ డివిజన్‌కు చెందిన క్రీడాకారిణి దుగ్గిరాల భావన దేవిని ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి అభినందించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, తన నియోజకవర్గానికి చెందిన క్రీడాకారిణి అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక కావడం ఎంతో సంతోషకరమని తెలిపారు. భావన దేవి భవిష్యత్తులో రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. త్వరలో జరిగే అంతర్జాతీయ క్రీడా పోటీల్లో భారత్‌కు బంగారు పతకం సాధించాలని శుభాకాంక్షలు తెలిపారు.క్రీడలకు, క్రీడాకారులకు తన వంతు సహకారాన్ని ఎల్లవేళలా అందిస్తానని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. క్రీడాకారులు మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే ప్రభుత్వ ప్రోత్సాహం ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు.ఈ అభినందన కార్యక్రమంలో మేడ్చల్-మల్కాజ్గిరి బాల్ బ్యాడ్మింటన్ సంఘం జాయింట్ సెక్రటరీ సూర్యనారాయణ పాల్గొన్నారు.

# రేషన్ దుకాణాల వద్ద పేదల బియ్యం దోపిడీ

- రేషన్ డీలర్ల అండతో దళారుల బహిరంగ వ్యాపారం

**పెద్దమందడి,ఫిబ్రవరి5(తెలంగాణ ముచ్చట్లు):**



వనపర్తి జిల్లా పెద్దమందడి మండలంలోని పలు గ్రామాలలో రేషన్ దుకాణాల వద్ద పేదలకు ప్రభుత్వం అందిస్తున్న బియ్యం పక్కదారి పడుతున్నాయన్న ఆరోపణలు తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. రేషన్ డీలర్ల అండదండలతో దళారులు రేషన్ దుకాణాల సమీపంలోనే బహిరంగంగా వ్యాపారం సాగిస్తున్నారని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు.రేషన్ బియ్యం తీసుకునేందుకు వచ్చే లబ్ధిదారులను లక్ష్యంగా చేసుకుని దళారులు మాయమాటలు చెబుతూ అక్కడికక్కడే బియ్యం విక్రయించేలా ప్రలోభాలకు గురి చేస్తున్నారని సమాచారం. ఇంటికి తీసుకెళ్లి ఏం లాభం? , ఇప్పుడే నగదు ఇస్తాం అంటూ పేదల అవసరాలను ఆసరాగా చేసుకుని తక్కువ ధరలకు బియ్యం కొనుగోలు చేస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ వ్యవహారం రేషన్ దుకాణాల దగ్గరే జరగడం డీలర్ల పాత్రపై అనుమానాలు పెంచుతోంది.ప్రభుత్వం పేదల కోసం సరఫరా చేస్తున్న బియ్యం ఈ విధంగా అక్రమంగా బయటకు వెళ్లిపోతుండటం వల్ల నిజమైన లబ్ధిదారులకు తీవ్ర నష్టం జరుగుతోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.అక్రమ రేషన్ బియ్యం వ్యాపారంపై వెంటనే సమగ్ర విచారణ చేపట్టాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.ఈ అంశాన్ని స్థానిక పెద్దమందడి ఎమ్మార్వో పాండు నాయక్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించారు.రేషన్ డీలర్లు ఎవరైనా దళారులను ప్రోత్సహించి అక్రమ వ్యాపారాలు చేస్తే వారిపై కఠిన చర్యలు తప్పవు. ఫిర్యాదులు అందితే వెంటనే విచారణ చేపడతాం అని ఎమ్మార్వో స్పష్టం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి, పెద్దమందడి మండలంలో పేదల బియ్యం

# గిరిజన కుటుంబం నుంచి పీహెచ్‌డీ వరకు

- అజ్మీర తండా యువకుడి అసాధారణ విజయం

**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 5 (తెలంగాణ ముచ్చట్లు)**



తిరుమలాయపాలెం మండలం అజ్మీర తండాకు చెందిన బోడ రమేష్ ప్రతిభకు గుర్తింపు లభించింది. భూగోళశాస్త్రం విభాగంలో ఆయన పీహెచ్‌డీ (డాక్టరేట్) పట్టా సాధించారు."సామాజిక,ఆర్థిక దృక్పథం ద్వారా ఎంపిక చేసిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై అధ్యయనం అనే అంశంపై ఆయన పరిశోధన పూర్తి చేసి పీహెచ్‌డీ పట్టాను పొందారు.గిరిజన కుటుంబంలో జన్మించిన బోడ రమేష్, ఆర్థిక ఇబ్బందులు, సామాజిక పరిమితులను అధిగమిస్తూ ఉన్నత విద్యలో ఈ స్థాయికి చేరుకోవడం అభినందనీయం. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు అమలులో గ్రామీణ ప్రాంతాల సామాజిక,ఆర్థిక పరిస్థితుల పాత్రను ఆయన తన పరిశోధనలో విశ్లేషించారు.

తిరుమలాయపాలెం మండలాన్ని కేస్ స్టడీగా తీసుకుని చేసిన ఈ పరిశోధన పాలసీ రూపకల్పనకు, గ్రామీణ అభివృద్ధికి ఉపయోగపడే విధంగా ఉందని అకడమిక్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.అజ్మీర తండా వంటి గిరిజన ప్రాంతాల నుంచి పీహెచ్‌డీ స్థాయి పరిశోధకులు రావడం ఇతర యువతకు ప్రేరణగా నిలుస్తుందని గ్రామస్తులు పేర్కొన్నారు. బోడ రమేష్ సాధించిన ఈ విజయంపై కుటుంబ సభ్యులు, స్నేహితులు, మేధావులు హర్షం వ్యక్తం చేస్తూ

## జాతీయ పారా త్రోబాల్ ఫెడరేషన్ కప్–2026లో

# సత్తా చాటిన తెలంగాణ

- పురుషులు రన్నరప్, మహిళలు మూడో స్థానం

**రాజస్థాన్,ఫిబ్రవరి05(తెలంగాణ ముచ్చట్లు):**







తెలంగాణ పారా క్రీడలకు జాతీయస్థాయిలో మరో గర్వకారణం దక్కింది. రాజస్థాన్ రాష్ట్రం ఝుంఝునూ జిల్లా సింఘానియా విశ్వవిద్యాలయంలో ఫిబ్రవరి 3 నుంచి 5 వరకు నిర్వహించిన పారా త్రోబాల్ నేషనల్ ఫెడరేషన్ కప్-2026లో తెలంగాణ పురుషుల, మహిళల జట్లు అద్భుత ప్రదర్శనతో మెరిశాయి. దేశవ్యాప్తంగా రాష్ట్ర జట్లు పాల్గొన్న ఈ ప్రతిష్ఠాత్మక పోటీల్లో తెలంగాణ జట్లు పతక స్థానాలు సాధించి రాష్ట్రానికి ఖ్యాతిని తీసుకొచ్చాయి.

ఈ ఫెడరేషన్ కప్‌లో పురుషుల విభాగంలో 12రాష్ట్రాల జట్లు,మహిళల విభాగంలో 8రాష్ట్రాల జట్లు పోటీపడ్డాయి. తీవ్ర పోటీ నడిచిన ఈ టోర్నీలో తెలంగాణ క్రీడాకారులు తమ సత్తాను చాటారు. పురుషుల విభాగంలో ఆంధ్రప్రదేశ్ విజేతగా నిలవగా, తెలంగాణ జట్టు రన్నరప్ స్థానాన్ని దక్కించుకుంది. హర్యానా జట్టు మూడో స్థానంలో నిలిచింది. ఫైనల్ వరకూ చేరిన తెలంగాణ పురుషుల జట్టు ప్రదర్శన వెనుక ఆటగాళ్ల కష్టపడే స్వభావం, క్రమశిక్షణతో కూడిన శిక్షణతో పాటు కోచ్ సింగారపు బాబు అందించిన మార్గనిర్దేశం కీలకంగా నిలిచింది.

మహిళల విభాగంలో ఝార్ఖండ్ విజేతగా నిలవగా, రాజస్థాన్ రన్నరప్ స్థానాన్ని పొందింది. తెలంగాణ మహిళల జట్టు మూడో స్థానాన్ని సాధించి రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచింది. పక్కా ప్రణాళిక, ఆత్మవిశ్వాసంతో కూడిన ఆటతీరు, కోచ్ సింగారపు బాబు అందించిన ప్రోత్సాహం ఈ విజయానికి ప్రధాన కారణంగా నిలిచింది.

ఈ టోర్నీకి మరింత ప్రాధాన్యం కల్పిస్తూ పారా త్రోబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, ఈ నేషనల్ ఫెడరేషన్ కప్-2026ను మలేషియాలో జరగనున్న రెండో ఆసియా పారా త్రోబాల్ ఛాంపియన్‌షిప్-2026కు ట్రయల్ సెలెక్షన్ పోటీలుగా ప్రకటించింది. ఈ పోటీల్లో విశేషంగా రాణించిన క్రీడాకారులకు అంతర్జాతీయ వేదికపై భారతదేశాన్ని ప్రాతినిధ్యం వహించే అవకాశం లభించనుంది.

శారీరక సవాళ్లను అధిగమిస్తూ తెలంగాణ పారా క్రీడాకారులు చూపిన పట్టుదల, సంకల్పం సమాజానికి, యువతకు గొప్ప ప్రేరణగా నిలిచింది. కోచ్‌లు, సహాయక సిబ్బంది, నిర్వాహకులు, కుటుంబ సభ్యుల సమిష్టికృషితో ఈ విజయాలు సాధ్యమయ్యాయి. ఈ ఫెడరేషన్ కప్ ద్వారా తెలంగాణ పారా త్రోబాల్‌లో జాతీయస్థాయిలో తన బలమైన ఉనికిని మరోసారి చాటింది.పారా క్రీడాకారుడి ప్రతి అడుగు ఒక విజయమే. ప్రతి సాధన తెలంగాణకు, దేశానికి గర్వకారణమే.

### మహిళా జట్టుకు కెప్టెన్ ఓరుగల్లు బిడ్డ కృష్ణవేణి

ఈ విజయానికి జిల్లా జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ మండలం విశ్వనాధపూర్ గ్రామానికి చెందిన మాచర్ల కృష్ణవేణి కీలక పాత్ర పోషించారు. తెలంగాణ మహిళా పారా త్రోబాల్ జట్టుకు కెప్టెన్‌గా బాధ్యతలు నిర్వహించిన ఆమె, ప్రతి మ్యాచ్‌లో నాయకత్వ లక్షణాలను ప్రదర్శిస్తూ జట్టును ముందుకు నడిపించారు. మైదానంలో ధైర్యం, క్రమశిక్షణ, సహచర క్రీడాకారులకు ధైర్యం చెప్పే తత్వంతో కృష్ణవేణి జట్టు విజయంలో ప్రధానంగా నిలిచారు. శారీరక సవాళ్లను లెక్కచేయకుండా పట్టుదలతో సాధన చేసిన ఆమె ప్రదర్శన యువ క్రీడాకారులకు ఆదర్శంగా నిలుస్తోంది. ఆమె నాయకత్వంలో తెలంగాణ మహిళా జట్టు జాతీయస్థాయిలో కాంస్య పతకం సాధించడం జిల్లాకే గర్వకారణంగా మారింది.




# అహంకారంతో అవహేళనగా మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేతలు

- ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి


**వనపర్తి, ఫిబ్రవరి5(తెలంగాణ ముచ్చట్లు):**

వనపర్తిలో కొందరు బీఆర్ఎస్ నాయకులు అహంకారంతో, అవహేళనగా మాట్లాడుతున్నారని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి తీవ్రంగా విమర్శించారు. పనిచేసుకుని బతకడం తప్పు అన్నట్టుగా మాట్లాడడం వారి లేకితనానికి నిదర్శనమని అన్నారు.కాంగ్రెస్ నాయకులు ఎలాంటి కబ్జాలు చేయలేదని, అవినీతి అక్రమాలకు పాలుపడలేదని స్పష్టం చేశారు.మనిషి పని చేసుకుని బతకడం తప్పు కాదని, దోచుకోవడమే తప్పని ఆయన వ్యాఖ్యానించారు.బీద కుటుంబాల్లో ఎవరు మరణించినా మేఘన్న అభయ హస్తం పేరిట ఆర్థిక సహాయం అందిస్తుంటే, బీఆర్ఎస్ నాయకులు వాటి పత్రిక కటింగ్లు సేకరించి ఆదాయపు పన్ను శాఖకు ఫిర్యాదు చేస్తామని బెదిరిస్తున్నారని మండిపడ్డారు. ఈ మున్సిపల్ ఎన్నికల్లో ఓడిపోతే వారు పత్రికలు అమ్ముకుని బతకాల్సిన పరిస్థితి వస్తుందని ఎద్దేవా చేశారు.వనపర్తిలో గురువారం నిర్వహించిన 4, 5, 1, 15, 16, 17, 18, 19, 20, 21 వార్డులకు సంబంధించిన కార్నర్ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేనారెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ.. ఇటీవల బీఆర్ఎస్ నాయకులు ఒళ్లు బలిసి మాట్లాడుతున్నారని, ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలని హెచ్చరించారు. తమకూ తిట్టడం వచ్చని, తిట్టగలమని కానీ తమకు సంస్కారం ఉందని చెప్పారు.ఆ సంస్కారం లేకపోవడం వల్లే వారు పిచ్చిపట్టినట్లు మాట్లాడుతున్నారని విమర్శించారు.మినీ ట్యాంక్ బండ్‌కు, కళాభవన్‌కు అంబేద్కర్ పేరు పెట్టనున్నట్లు తెలిపారు.బీఆర్ఎస్‌కు ఓటేస్తే మోరీలో వేసినట్లేనని వ్యాఖ్యానించారు. ఎన్నికల్లో పోటీ చేస్తున్న కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థులను చూసి ఎల్ఐసీ చేసే వాడు పాలసీలు చేయాలని, ఇసుక అమ్ముకోవాలని, కాంట్రాక్టులు చేసుకోవాలని ఎద్దేవా చేసిన మాజీ మంత్రికి



వనపర్తిలో 130 ఎకరాలు, పెద్దమందడిలో కృష్ణానది పక్కన ఫామ్ హౌజ్లు ఎలా వచ్చాయో చెప్పాలని ప్రశ్నించారు.నన్ను ఎంపీటీసీని, పాలు అమ్ముకున్నానని, ట్రాక్టర్లు నడిపానని విమర్శించారని తెలిపారు. తమ తల్లిదండ్రులు వ్యవసాయం చేస్తే, దానికి అనుబంధంగా పాడి నమ్ముకుని పాలు అమ్ముకోవడంలో తప్పేముందని ప్రశ్నించారు.లారీ కంపెనీ ఉండి బండ్లు నడిపిన తప్ప, మోసం చేసి డిమాండ్ చేసి సంపాదించలేదని స్పష్టం చేశారు. ఎవరి వృత్తి వారు చేసుకోవడంలో తప్పులేదని, మైండ్ దొబ్బి మాట్లాడటం సరికాదన్నారు.ఈ మున్సిపల్ ఎన్నికల్లో వనపర్తిలోని 33 వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థులే గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. మరో 20 సంవత్సరాల పాటు నీటి ఇబ్బంది లేకుండా ఉండేందుకు రూ.72 కోట్లతో 12 నీటి ట్యాంకులు నిర్మించనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం కాంగ్రెస్ పాలనలో పట్టణాలు, మున్సిపాలిటీలు, గ్రామాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని అన్నారు.నేడు జరుగుతున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు.ఈ కార్యక్రమంలో పోటీ చేసిన అభ్యర్థులు శరవంద, వెంకటేష్, జయానంద్, ఎల్ఐసీ కృష్ణ, పాకనాటి కృష్ణయ్య, ధనలక్ష్మి, బషీర్, సౌమ్య రఘు, చుక్క జయశ్రీ, రాజు, ఆవుల ప్రతిభ జగదీష్, టీపీసీసీ సభ్యులు శంకర్ ప్రసాద్, సీపీఐ నాయకులు రమేష్, బాబా, ఆయా వార్డుల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# లేఔట్ అనుమతుల జారీలో నిబంధనలు కట్టుదిట్టంగా పాటించాలి





- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి -05(తెలంగాణ ముచ్చట్లు)**

లేఔట్ అనుమతుల జారీలో నిబంధనలను కట్టుదిట్టంగా పాటించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. జిల్లా కలెక్టర్, కలెక్టరేట్ ప్రజ్ఞా సమావేశ మందిరంలో జిల్లా స్థాయి లేఔట్ కమిటీ సమావేశంలో మునిసిపల్ కార్పోరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య తో కలిసి పాల్గొన్నారు. పెండింగ్ ఉన్న లేఔట్ అనుమతులపై కలెక్టర్ సంబంధిత రెవెన్యూ, ఇరిగేషన్, ఇతర లైన్ డిపార్ట్మెంట్ అధికారులతో సుదీర్ఘంగా చర్చించి, ప్రతి లే అవుట్ దరఖాస్తుకు సంబంధించి సంబంధిత శాఖల నుంచి రిమార్క్స్, అభ్యంతరాలను అడిగి తెలుసుకొని పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ 12 డ్రాఫ్ట్ లేఔట్, 4 ఫైనల్ లేఔట్ లను కమిటీ పరిశీలించిందని అన్నారు. లేఔట్ అనుమతులను మంజూరు చేసే సమయంలో తప్పనిసరిగా ఎటువంటి వాటర్ బాడి ఎఫ్.టి.ఎల్., బఫర్ జోన్ పరిధిలో రాకుండా జాగ్రత్త పడాలని అన్నారు. లేఔట్ లో అప్రోచ్ రోడ్డు 18 మీటర్లు ఉండాలని అన్నారు. రోడ్డు నిర్మాణానికి అవసరమైన మేర భూమి లే ఔట్ లో కేటాయింపులు జరిగేలా అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలని కలెక్టర్ తెలిపారు. లేఔట్ ప్రాంతం నీటి వనరులు, నీటి ప్రవాహాలకు నిర్దేశించిన దూరంలో ఉండాలని, ఎఫ్.టి.ఎల్, బఫర్ జోన్ లలో అనుమతులు జారీ చేయడం కుదరదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఏడి సర్వే ల్యాండ్ రికార్డ్స్, మండల సర్వేయర్, ఆర్డిఓ లు సంయుక్తంగా లేఔట్ దరఖాస్తును చుట్టు పక్కల సర్వే నెంబర్లను పరిశీలించి రిపోర్ట్ అందించాలని అన్నారు.

లేఔట్ ప్రాంతంలో గతంలో ఏమైనా నీటి వనరులు ఉన్నాయా అని సంబంధిత అధికారులు క్షుణ్ణంగా సాంకేతికతను వినియోగిస్తూ పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. లేఔట్ ఆమోద ప్రక్రియ పారదర్శకంగా ఉండాలని, నిబంధనలకు లోబడి మాత్రమే అనుమతులు జారీ చేయాలని, మనం జారీ చేసిన అనుమతుల నిబంధనలను అభివృద్ధి సమయంలో పాటిస్తున్నారు లేదో పర్యవేక్షణ ఉండాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో ఎస్.డి.సి. ఎం. రాజేశ్వరి, ఆర్ అండ్ బి ఎస్ఈ యాకోబు, పిఆర్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, ఎన్పిడిసిఎల్ ఎస్ఈ. శ్రీనివాసాచారి, డిస్ట్రిక్ట్ టౌన్ కంట్రీ ప్లానింగ్ అధికారి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడి రాజేందర్, ఏదులాపురం టౌన్ ప్లానింగ్ అధికారి, ఈఈ ఇరిగేషన్ శ్రీనివాస రెడ్డి, డీఈ ఇరిగేషన్ కే. రాజేష్, తహసీల్దార్లు రాంప్రసాద్, సైదులు, శ్వేత, అరుణ, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మనిగిల్ల గ్రామంలో గ్రామసభ.. అభివృద్ధి పనులపై కీలక చర్చ

- అభివృద్ధే లక్ష్యంగా సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్ చర్యలు

**పెద్దమందడి,ఫిబ్రవరి5(తెలంగాణ ముచ్చట్లు):**

పెద్దమందడి మండలం మనిగిల్ల గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సభలో గ్రామ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చ జరిగింది.ఈ సందర్భంగా కొత్తగా నిర్మించనున్న సిసి రోడ్లు, అండర్ డ్రైనేజ్ మోరీలు, మంచినీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణ, కొత్తగా ప్రారంభించనున్న ఉపాధి పనులపై చర్చించారు. ఉపాధి హామీ పథకం ద్వారా అచన్న కాలువలో జమ్ము మరియు సిల్ట్ తొలగింపు పనులు చేపట్టాలని ప్రతిపాదించారు.గ్రామపంచాయతీ సెక్రటరీ వెంకటేష్ మాట్లాడుతూ.. గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని తెలిపారు.ఉప సర్పంచ్ గణేష్, వార్డు సభ్యులు తమ సలహాలు, సూచనలు వ్యక్తం చేశారు. అనంతరం సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్ గ్రామసభలో పాల్గొన్న అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్, ఉప సర్పంచ్ ముప్పూరి గణేష్‌కుమార్, పంచాయతీ సెక్రటరీ వెంకటేష్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, కరెంట్ లైన్ మ్యాన్, అంగన్వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు పాల్గొని అభివృద్ధి పనులపై చర్చించారు.





## పోగొట్టుకున్న 35 గ్రాముల బంగారు ఆభరణాలను బాధితులకు అప్పగించిన బ్లూ కోల్ట్స్ పోలీస్

**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 5 (తెలంగాణ ముచ్చట్లు)**

వైద్యం కోసం నగరానికి వచ్చిన సూర్యాపేట జిల్లా, చివెళ్ల గ్రామానికి చెందిన గుగులోత్ లక్పతి తన వద్ద వున్న 35 గ్రాముల బంగారు ఆభరణాలను ఎక్కడో పోగొట్టుకున్నాడు. ఆలస్యంగా గుర్తించిన బాధితుడు డయల్ 100 కు కాల్ చేశారు. వెంటనే స్పందించిన ఖమ్మం 2 టౌన్ పోలీస్ బ్లూ కోల్ట్స్ పోలీస్ సిబ్బంది డి. శ్రీను, టి. భీముడు బాధితుడు తిరిగిన హాస్పిటల్, మెడికల్ షాప్ ప్రాంతాలలో సీసీటీవీ ఫుటేజీని పరిశీలించి మెడికల్ షాప్ లో మర్చిపోయిన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకొని ఖమ్మం టూ టన్ ఎస్ఐ రమేష్ సమక్షంలో బాధితుడికి అప్పగించారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ బాలకృష్ణ బ్లూ కోల్ట్స్ పోలీస్ సిబ్బందిని అభినందించారు.

## ఫిబ్రవరి 22 లోపు ఫౌండేషన్ కోర్సు ప్రవేశ పరీక్షకు దరఖాస్తు సమర్పించాలి

- షెడ్యూల్ కులాల అధ్యయన కేంద్రం ఖమ్మం జిల్లా సంచాలకులు వెంకటేశ్వర్లు

**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 5 (తెలంగాణ ముచ్చట్లు)**

ఖమ్మం ఎస్సీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో రెసిడెన్షియల్ పద్ధతిలో 5 నెలల పాటు ఉచిత శిక్షణ అందించే ఫౌండేషనల్ కోర్సు ప్రవేశ పరీక్షకు ఆసక్తి గల అభ్యర్థులు ఫిబ్రవరి 22 లోపు దరఖాస్తు చేసుకోవాలని షెడ్యూల్ కులాల అధ్యయన కేంద్రం ఖమ్మం జిల్లా సంచాలకులు ఎస్. వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఖమ్మం స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో గ్రూప్స్, రైల్వే రిక్రూట్మెంట్ బోర్డ్, స్టాఫ్ సెలక్షన్ కమిటీ, బ్యాంకింగ్ మొదలైన వివిధ పోటీ పరీక్షలకు సంబంధించి భోజన, వసతితో కూడిన 5 నెలల బేసిక్ ఫౌండేషన్ కోర్సును అర్హులైన 100 మంది నిరుద్యోగ అభ్యర్థులకు ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు.

ఎస్సీలకు 75 శాతం, ఎస్టీలకు 10 శాతం, బీసీలకు, మైనారిటీ లకు కలిపి 15 శాతం, ఓవరాల్ మహిళలకు 33.3 శాతం, దివ్యాంగులకు ఐదు శాతం చొప్పున రిజర్వేషన్ పాటించడం జరుగుతుందని, అభ్యర్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం 3 లక్షల లోపు ఉండాలని, అభ్యర్థులు డిగ్రీ ఉత్తీర్ణత సాధించి ఉండాలని అన్నారు.

అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు స్టడీ సర్కిల్ ప్రవేశ పరీక్షకు http://tsstudycircle.co.in వెబ్ సైట్ లో ఫిబ్రవరి 22 లోపు దరఖాస్తులు సమర్పించాలని, ఇతర వివరాలకు 9866726277, 7981988667 నెంబర్ నందు సంప్రదించాలని షెడ్యూల్ కులాల అధ్యయన కేంద్రం ఖమ్మం జిల్లా సంచాలకులు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



## నాలుగో డివిజన్‌లో బీజేపీ జోరు

- పుల్ల స్వరూప గెలుపే లక్ష్యంగా విస్తృత ప్రచారం

**పరకాల,ఫిబ్రవరి05(తెలంగాణ ముచ్చట్లు):**

పరకాల మున్సిపల్ ఎన్నికల్లో నాలుగో డివిజన్ కౌన్సిలర్‌గా పోటీ చేస్తున్న భారతీయ జనతా పార్టీ అభ్యర్థి పుల్ల స్వరూపకు మద్దతుగా ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. నాలుగో డివిజన్ ఇంచార్జి, జిల్లా కోశాధికారి ఎర్ర రామన్నతో పాటు ఆ డివిజన్‌కు చెందిన బూత్ నాయకులు, కార్యకర్తలు ఇంటింటా ప్రచారంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా దేశ ప్రధాని నరేంద్ర మోడీ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలతో దేశం అన్ని రంగాల్లో ముందుకు సాగుతోందని పేర్కొంటూ, అభివృద్ధి కొనసాగాలంటే భారతీయ జనతా పార్టీ అభ్యర్థి పుల్ల స్వరూపను గెలిపించాలని ఓటర్లను కోరారు.ఈ ప్రచారంలో పుల్ల రాజు, సాంబయ్య, ఈశ్వర్, అభిరామ్, లత, దీప, సుజాతతో పాటు వార్డు ప్రజలు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ మద్దతు తెలిపారు.

## హర్షాస్ కిచెన్ సెంటర్‌ను ప్రారంభించిన పరమేశ్వర్ రెడ్డి

**ఉప్పల్, ఫిబ్రవరి 05 (తెలంగాణ ముచ్చట్లు):**

ఉప్పల్ భాగాయత్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన హర్షాస్ కిచెన్ సెంటర్‌ను ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి (ఎంపీఆర్) గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎంపీఆర్ మాట్లాడుతూ, యువత స్వయం ఉపాధి రంగాల్లో రాణించాలని, వ్యాపార అవకాశాలను





అందిపుచ్చుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. ఇలాంటి వ్యాపార సంస్థలు స్థానికంగా ఉపాధి అవకాశాలు కల్పించడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఆయన పేర్కొన్నారు.ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కిచెన్ సెంటర్ యజమానులు హర్షవర్ధన్ - కవిత చైతన్య దంపతులు, భూసం రఘునాథరెడ్డి, ఈగ సంతోష్ ముదిరాజ్, బొమ్మల సుధాకర్, ఢిల్లీ చంద్రశేఖర్ రెడ్డి, జితేందర్ రెడ్డి, కన్నెమైన నరేష్ ముదిరాజ్, ప్రశాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రజల అవసరాలకు అనుగుణంగా వసతులు మెరుగుపరచాలి

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి -05(తెలంగాణ ముచ్చట్లు)**



ఖమ్మం జనరల్ ఆసుపత్రి ద్వారా రోగులకు మెరుగైన వైద్య సేవలందిస్తూ, ఆసుపత్రిలో ప్రజల అవసరాలకు అనుగుణంగా వసతులు మెరుగుపరచాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.

జిల్లా కలెక్టర్, కలెక్టరేట్ లోని ప్రజ్ఞ మీటింగ్ హాల్ లో గురువారం ఖమ్మం జనరల్ ఆసుపత్రి పని తీరు, ఆసుపత్రిలో ఉన్న పెండింగ్ అభివృద్ధి పనులపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, మునిసిపల్ కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య లతో కలిసి ఆసుపత్రి వైద్య అధికారులు, మున్సిపల్, మిషన్ భగీరథ, సంబంధిత అధికారులతో సమీక్షించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ప్రజల అవసరాలకు అనుగుణంగా ఖమ్మం ఆసుపత్రిలో వసతులు మెరుగుపరచాల్సిన అవసరం ఉందని అన్నారు. ఆసుపత్రిలో పారిశుద్ధ్య నిర్వహణ సిబ్బంది, వైద్యులు అందుబాటులో ఉండటం లేదని, ఫిర్యాదులు వస్తున్నాయని, ఈ పద్ధతిలో వెంటనే మార్పు రావాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

రెండు వారాలకు ఒకసారి ఆసుపత్రి పని తీరుపై ఖమ్మం మున్సిపల్ కమీషనర్ రివ్యూ నిర్వహించాలని అన్నారు. ఆసుపత్రిలోని 10 స్పెషల్ రూమ్ మరమ్మత్తు పనులు మునిసిపల్ కార్పోరేషన్ ద్వారా చేపట్టి 15 రోజులలో పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ఎమర్జెన్సీ సమయంలో వినియోగించేందుకు జిజిహెచ్ వద్ద 5 లక్షల రూపాయలు నిరంతరం అందుబాటులో పెడతామని, ఏ విభాగంలో నైనా వైద్య పరికరాలు, యంత్రాలు అవసరం ఉంటే, వెంటనే కొనుగోలు చేయాలని, ఆసుపత్రిలో కోటి 65 లక్షలతో చేపట్టిన టాయిలెట్స్ లను రాబోయే నెల రోజుల వ్యవధిలో 100 శాతం పూర్తి చేసి, టాయిలెట్స్ నిర్మాణంతో పాటు వాటి నిర్వహణకు కూడా చర్యలు తీసుకోవాలన్నారు.

ఆసుపత్రిలో ఆర్.ఎం.ఓ. లను నియమించి పాలన వ్యవహారాలు వారికి అప్పగించాలని కలెక్టర్ సూచించారు. ఎం.సి.హెచ్. లోని సీవర్ లైన్స్, టాయిలెట్స్ పనులు ఫిబ్రవరి నెలాఖరు వరకు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఆసుపత్రి ముందు ఉన్న ఖాళీ స్థలంలో ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలని కలెక్టర్ తెలిపారు.

ఓపి రిజిస్ట్రేషన్ కోసం ప్రత్యేక బ్లాక్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఓపి కోసం 3 డేటా ఎంట్రీ ఆపరేటర్ లను తాత్కాలిక ప్రాతిపదికన నియమించాలని కలెక్టర్ ఆదేశించారు. ఆసుపత్రిలో లిఫ్ట్ మరమ్మత్తు పనులు పూర్తి కాకపోవడం పట్ల కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేసి, 7 రోజుల్లో లిఫ్ట్ పని చేయాలన్నారు.

ఆసుపత్రి అవసరాల కోసం ప్రస్తుత వాటర్ సంప్ సరిపోవడం లేదని, మరో 200 కేఎల్ సామర్థ్యంతో కూడిన సంప్ నిర్మించాలని అన్నారు. వర్షా కాలం ముందే ఆసుపత్రి భవనం నుండి ఎక్కడా వాటర్ లీకేజి కాకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. ఎస్.టీ.పి. పెండింగ్ నిర్మాణ పనులను మరొక కాంట్రాక్టర్ తో చేపట్టి మార్చి 15 నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

ఆసుపత్రిలో అవసరమైన ఫైర్ సేఫ్టీ పనులు, సిసి కెమెరాల ఏర్పాటు మార్చి 15 నాటికి ఏర్పాటు చేయాలని కలెక్టర్ మున్సిపల్ కమీషనర్ కు సూచించారు. ఆసుపత్రి వద్ద రోడ్డు పై స్పీడ్ బ్రేకర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, అవసరమైన భద్రత ఏర్పాట్లు ఉండాలన్నారు. ఆసుపత్రిలో అవసరమైన అంతర్గత రోడ్లు, ఫుట్ పాత్ తో సహా నిర్మాణ పనులు చేపట్టి నెలాఖరు వరకు పూర్తి చేయాలని అన్నారు.

నెలకు 55 లక్షలు ఖర్చు చేస్తున్నప్పటికీ ఆసుపత్రిలో ఆశించిన స్థాయిలో పారిశుద్ధ్యం ఉండటం లేదని కలెక్టర్ అన్నారు. పారిశుద్ధ్య పని తీరు సరిగ్గా లేదంటూ సంబంధిత ఏజెన్సీలకు నోటీసు జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పారిశుద్ధ్యం పని తీరు ఇంప్రూవ్ కాని పక్షంలో సదరు ఏజెన్సీ రద్దు చేయాలని డీఎంఈకు లేఖ రాయాలని అన్నారు.

ఆసుపత్రిలో ఎఫ్.ఆర్.ఎస్. విధానంలో పారిశుద్ధ్య సిబ్బంది హాజరు నమోదయ్యేలా వ్యవస్థ ఏర్పాటు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎఫ్.ఆర్.ఎస్. హాజరు రిపోర్ట్ ఆధారంగా పారిశుద్ధ్య సిబ్బందికి సంబంధించి జీతాలు చెల్లింపు చేయాలని అన్నారు. బయో మెడికల్ వేస్ట్ డిస్పోజల్ కోసం అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

ఫిబ్రవరి 11 నాటికి బయో మెడికల్ ఇంజనీర్ తాత్కాలికంగా నియామకం చేపట్టాలని, ఆసుపత్రి కోసం అవసరమైన సామాగ్రి కొనుగోలుకు అందించిన ప్రతిపాదనలు ఫాలో అప్ చేస్తూ త్వరగా ఆసుపత్రికి చేరేలా చూడాలని, టిఫ్ఫా స్కానింగ్ ప్రభుత్వ ఆసుపత్రిలో చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గత 3 నెలలుగా జనరల్ ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య తగ్గుతుందని అన్నారు. అత్యంత క్లిష్టమైన హై రిస్క్ కేసులను గాంధీ ఆసుపత్రికి రిఫర్ చేసిన తర్వాత ఆ కేసులను ఫాలో అప్ చేయాలన్నారు.

ఈ సమావేశంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. నరేందర్, వైద్య శాఖ ఇఇ ఉమామహేశ్వర రావు, మునిసిపల్ సహాయ కమిషనర్ అనిల్ కుమార్, వివిధ విభాగాల వైద్య అధికారులు, మిషన్ భగీరథ, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సత్తుపల్లిలో కాంగ్రెస్ రోడ్‌షోకు భారీ స్పందన

- మంత్రి పొంగులేటితో కలిసి పాల్గొన్న
- మువ్వా విజయబాబు , ఎమ్మెల్యే రాగమయి, మట్టా దయానంద్.

**సత్తుపల్లి, ఫిబ్రవరి 5 (తెలంగాణ ముచ్చట్లు):**





మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సత్తుపల్లి పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్నర్ రోడ్‌షో ప్రజల నుంచి విశేష స్పందన పొందింది. తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి ఈ రోడ్‌షోలో సత్తుపల్లి మున్సిపాలిటీ ఎలక్షన్ ఇంచార్జ్, టిజిఐడిసి చైర్మన్ మువ్వా విజయబాబు, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్ పాల్గొన్నారు. పట్టణంలోని మాధురి ఫంక్షన్ హాల్ నుంచి భారీ ర్యాలీగా ప్రారంభమైన రోడ్‌షో ప్రధాన రహదారులు, కాలనీలు, వాణిజ్య ప్రాంతాల గుండా సాగింది. రోడ్‌షో సాగుతున్నంతసేపు ప్రజలు రహదారుల ఇరువైపులా నిలబడి కాంగ్రెస్ నాయకులకు అభివాదం చేశారు. మహిళలు, యువత, వృద్ధులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ మద్దతు తెలియజేశారు.

ఈ సందర్భంగా టిజిఐడిసి చైర్మన్ మువ్వా విజయబాబు మాట్లాడుతూ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. పేదలకు రేషన్ కార్డుల మంజూరు, సన్నబియ్యం పంపిణీ ద్వారా ఆహార భద్రత కల్పించామని చెప్పారు. డ్వాక్రా సంఘాలను బలోపేతం చేయడానికి వడ్డీ లేని రుణాలు, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు వివరించారు. మహిళల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఆయన పేర్కొన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం, గృహ జ్యోతి పథకం కింద ఉచిత విద్యుత్, రైతులకు రైతు భరోసా పథకం, నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం వంటి పథకాలు ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొస్తున్నాయని తెలిపారు.

సత్తుపల్లి పట్టణ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టమైన ప్రణాళికతో ముందుకు వెళ్తోందని చెప్పారు. రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, పారిశుద్ధ్య సదుపాయాల మెరుగుదలతో పాటు పట్టణ సౌందర్యం పెంపుపై దృష్టి సారించనున్నట్లు వెల్లడించారు. ఈ ఎన్నికల్లో సత్తుపల్లి మున్సిపాలిటీలో పోటీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి చెందిన 23 మంది అభ్యర్థులను ప్రజలు అధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ స్థాయి నాయకులు, కౌన్సిలర్ అభ్యర్థులు, కార్యకర్తలు, అలాగే మంత్రి పొంగులేటి, మువ్వా విజయబాబు, మట్టా రాగమయి, మట్టా దయానందల అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పరకాలలో బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం

**పరకాల,ఫిబ్రవరి05(తెలంగాణ ముచ్చట్లు):**

పరకాల పట్టణంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పలు వార్డులలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, కేతిరెడ్డి వాసుదేవరెడ్డి పాల్గొన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని వారు ప్రజలను కోరారు.ప్రచారం అనంతరం కొత్త బొడ్రాయి సెంటర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను గందరగోళానికి గురి చేస్తోందని ఆరోపించారు. గృహలక్ష్మి లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు అందించడంలో స్పష్టత లేక ఇబ్బందులు పెరుగుతున్నాయని అన్నారు. బీఆర్ఎస్ పాలనలోనే పరకాల పట్టణం అభివృద్ధి చెందిందని, గత రెండేళ్లలో ప్రస్తుత పాలనలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో మంజూరైన నిధులను రద్దు చేయడమే కాకుండా, అప్పట్లో వేసిన శిలాఫలకాలను తొలగించి కొత్తవిగా చూపుతున్నారని విమర్శించారు. 100 పడకల ఆసుపత్రి, డిగ్రీ కళాశాల, ఇంటిగ్రేటెడ్ వెజ్ - నాన్‌వెజ్ మార్కెట్, దామెర చెరువు మినీ ట్యాంక్ బండ్ వంటి పనులు పూర్తిచేయాలని డిమాండ్ చేశారు.

కేతిరెడ్డి వాసుదేవరెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని అన్నారు. రెండేళ్ల పాలనలో రాష్ట్రం నష్టపోయిందని వ్యాఖ్యానించారు. కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలంటే మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేస్తేనే విజయం సాధ్యమని చెప్పారు.

ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ, ప్రస్తుత పాలనలో రాష్ట్రానికి జరిగిన ప్రయోజనాలపై ప్రశ్నలు లేవనెత్తారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాలు విస్తృతంగా అమలయ్యాయని, రైతుల సాగునీటి, విద్యుత్ సమస్యలు పరిష్కరించారని తెలిపారు. గురుకులాలు, బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేయడం ద్వారా విద్య, వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువచ్చినట్టు చెప్పారు. కాంగ్రెస్ పాలనలో గురుకుల విద్యార్థుల మరణాలు చోటుచేసుకున్నాయని ఆరోపించారు. చెక్‌డ్యాంల ధ్వంసంపై చర్యలు లేవని విమర్శించారు. పట్టణ ప్రగతి కార్యక్రమం కింద వీధిలైట్లు, డ్రైన్లు, పార్కులు, డంప్‌యార్డులు అభివృద్ధి చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని అన్నారు. మున్సిపాలిటీలో నిలిచిపోయిన రోడ్లు, మురికికాల్వల పనులు పూర్తికావాలన్నా, పట్టణ అభివృద్ధి కొనసాగాలన్నా బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని వారు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో 1, 2, 3, 12, 13, 14, 15, 22 వార్డుల బీఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.







## జూనియర్ కరాటే పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించిన నైనిక

**హన్మకొండ,ఫిబ్రవరి05(తెలంగాణ ముచ్చట్లు):**

జూనియర్ కరాటే పోటీల్లో హనుమకొండ జిల్లా గోపాల్‌పూర్‌కు చెందిన చిన్నారి నైనిక గోల్డ్ మెడల్ సాధించింది. లావుడియా సౌమ్య, రాజేష్ నాయక్‌ల కుమార్తె అయిన నైనిక హైదరాబాద్‌లో నిర్వహించిన జూనియర్ కరాటే పోటీల్లో ప్రతిభ కనబర్చి విజేతగా నిలిచింది. చిన్న వయసులోనే కరాటేలో ప్రతిభ చూపిన నైనిక భవిష్యత్తులో మరిన్ని పోటీల్లో పాల్గొని బంజారా సమాజానికి గర్వకారణంగా నిలవాలని పలువురు ఆకాంక్ష వ్యక్తం చేస్తున్నారు.

బంజారా బిడ్డలు విద్య, క్రీడలు సహా వివిధ రంగాల్లో ముందుకు రావాలన్నదే సమాజ ఆశయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ తరపున వీఎన్ నాయక్ నైనికను అభినందిస్తూ, ఆమె అమ్మమ్మ సుశీలా బాయి, తాత పాడియా శివరాం, తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భూక్యా శ్రావణ్ కుమార్, లావుడియా రాజు నాయక్ తదితరులు పాల్గొని నైనిక విజయానికి హర్షం వ్యక్తం చేశారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# యువతే జాతీయ ఐక్యతకు పునాది

**వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య**

**వరంగల్,ఫిబ్రవరి05(తెలంగాణ ముచ్చట్లు):**


యువతే జాతీయ ఐక్యతకు పునాదిగా నిలవాలని వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య అన్నారు. దేశంలోని విభిన్న సంస్కృతుల మధ్య వారధిగా యువత పాత్ర కీలకమని పేర్కొన్నారు. బాలసముద్రంలోని యూత్ హాస్టల్‌లో మై భారత్ - వరంగల్ ఆధ్వర్యంలో, యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ నిర్వహిస్తున్న అంతర్రాష్ట్ర యువజన మార్పిడి కార్యక్రమాన్ని ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కేరళ రాష్ట్రానికి చెందిన 40 మంది యువతీ యువకులు పాల్గొన్నారు. ఫిబ్రవరి 5 నుంచి 9 వరకు సాగే ఈ కార్యక్రమంలో వారికి తెలంగాణ సంస్కృతి, చరిత్ర, సంప్రదాయాలపై అవగాహన కల్పించనున్నారు.






ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, భారతదేశం అనేక భాషలు, మతాలు, సంస్కృతులతో కూడిన మహా సమాఖ్య దేశమని తెలిపారు. ఈ వైవిధ్యాన్ని బలంగా మార్చే బాధ్యత యువతదేనని స్పష్టం చేశారు. ఇతర రాష్ట్రాల యువతతో కలిసి మెలిసి ఉండటం ద్వారా పరస్పర గౌరవం, అవగాహన పెరుగుతాయని అన్నారు. యువతలో ద్వేష భావాలు పెరగకుండా ఐక్యత, సహన భావాలు పెంపొందించాల్సిన అవసరం ఉందని చెప్పారు. స్వామి వివేకానందుల ఆదర్శాలు యువతకు దిశానిర్దేశకమని, దేశ భవిష్యత్తును మలిచే శక్తి యువతకే ఉందని పేర్కొన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని చారిత్రక కట్టడాలు, పర్యాటక ప్రాంతాలను సందర్శించి తెలంగాణ వారసత్వాన్ని తెలుసుకోవాలని యువతకు సూచించారు. వివిధ సంస్కృతుల అనుభవ మార్పిడి ద్వారా జాతీయ సమైక్యత మరింత బలపడుతుందని ఆమె అభిప్రాయపడ్డారు.

అదేవిధంగా మేర యువభారత్ వేదికగా సేవలందించిన యువజన నాయకులు ప్రజాప్రతినిధులుగా ఎదగడం గర్వకారణమని పేర్కొంటూ, ఇటీవల సర్పంచులు, ఉప సర్పంచులుగా ఎన్నికైన వారిని ఎంపీ సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ ఆర్కియాలజీ ఇంజనీర్ కృష్ణ చైతన్య, ఆర్డీవో రాథోడ్ రమేష్, డిప్యూటీ డైరెక్టర్ మేర యువభారత్ అన్వేష్ చింతల, మధు తదితరులు పాల్గొన్నారు.




**తుఫాను వచ్చి వెలిసిన సంద్రంలా.. చెట్లన్ని నరికివేయబడ్డ తర్వాత**
**ఉత్తి మొండాలు మిగిలిన వనంలా .. నాలో ఖాళీతనమే అంతా.**

**పువ్వులు, ఆకులన్నీ రాలిన .. వేసవి కాలం లా**
**నెలలు నిండిన బిడ్డా .. తల్లి గర్భంలో కదల్లేక బిగిసిపోయినట్టుగా**
**నా తనువంతా ఒకటే ఉక్కపోతా.**

**ఎందుకీ భావోద్వేగం, ఎందుకీ దుఃఖం అని ఖాళీగా వున్నా ఇల్లంతా తిరిగి చూసా**
**మరణ మృధంగం మొగే ఆ స్మశాన వాటికలో చచ్చిన మనసునీ దేహాన మోస్తూ**
**జీవంలేని పీనుగునై నాకు నేనే అద్దంలో తారసపడ్డా.**

**ఒంటరితనం అని బదులిచ్చిందది..**
**చుట్టు మనుషులు లేని వైరాగ్యం అంది..**
**మూసి పెట్టిన తలుపుల్ని తెరిచి..**
**కాసింత వెలిగుని తాగి**
**మళ్ళీ జీవం పోసుకోమని సలహానిచ్చింది.**

**ఆమ్మో!..**
**మనుషుల దగ్గరికి మళ్ళీ నా..?**
**భయమేసింది.**
**వద్దు.. వద్దంటే వద్దు..**
**నాకి ఒంటరితనమే చాలా బాగుంది!!**



**దియా విఘ్నేష్**

# ఎంఎస్ఎంఈ ల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు అవసరం

- **లోక్‌సభలో లిఖిత పూర్వక సమాధానం కోరిన ఎంపీ కావ్య**
- **వరంగల్‌ను పరిశ్రమల హబ్‌గా తీర్చిదిద్దడమే తన లక్ష్యం**
- **వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య**

**వరంగల్,ఫిబ్రవరి05(తెలంగాణ ముచ్చట్లు):**

వరంగల్ జిల్లా పరిశ్రమల అభివృద్ధికి సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల పాత్ర అత్యంత కీలకమని వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య స్పష్టం చేశారు. వరంగల్‌ను పరిశ్రమల హబ్‌గా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని పేర్కొంటూ, ఈ దిశగా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని లోక్‌సభలో లిఖిత పూర్వకంగా సమాధానం కోరారు.

పరిశ్రమల వృద్ధి, ఎగుమతుల పెంపు, యువతకు ఉపాధి అవకాశాల కల్పన లక్ష్యంగా ఎంఎస్ఎంఈ లకు ప్రోత్సాహం మరింత బలోపేతం కావాలని ఎంపీ కేంద్రాన్ని కోరారు. వరంగల్ జిల్లాలో పరిశ్రమల అభివృద్ధికి అనుకూలంగా పరిశ్రమల క్లస్టర్లు ఏర్పాటు చేయడం, ఎగుమతులకు అనువైన వాతావరణం కల్పించడం, బ్యాంకు రుణాలు సులభంగా అందేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. జాతీయ స్థాయి మౌలిక వసతుల ప్రణాళికలతో వరంగల్ ఎంఎస్ఎంఈ లను అనుసంధానిస్తే పరిశ్రమల అభివృద్ధి వేగవంతమవుతుందని ఆమె అభిప్రాయపడ్డారు.

వరంగల్ జిల్లా యువతకు ఉపాధి కల్పనకు శాశ్వత పరిష్కారం పరిశ్రమల స్థాపనేనని ఎంపీ పేర్కొన్నారు. స్థానికంగా పరిశ్రమలు ఏర్పాటైతే వేలాది మందికి ఉద్యోగ అవకాశాలు కలుగుతాయని వివరించారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం వరంగల్ జిల్లాలో ఎంఎస్ఎంఈ ల అభివృద్ధికి కొన్ని ప్రాజెక్టులు మంజూరు చేసిన నేపథ్యంలో, వాటి అమలును వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా, భూమిపై ఫలితాలు కనిపించేలా చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని కోరారు.



వరంగల్ జిల్లాకు మంజూరైన టెక్నాలజీ సెంటర్‌ను త్వరితగతిన పూర్తి చేసి, యువతకు ఆధునిక నైపుణ్య శిక్షణ అందేలా ఉపయోగంలోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. అలాగే ఎగుమతుల కోసం హైదరాబాద్‌లో ఉన్న సౌకర్య కేంద్రాల సేవలను వరంగల్ పరిశ్రమలకు మరింత విస్తరించాలని సూచించారు. చిన్న పరిశ్రమలకు రుణాల విషయంలో బ్యాంకులు అనవసరమైన అడ్డంకులు సృష్టిస్తున్నాయని, వాటిని తొలగించి ఎంఎస్ఎంఈ లకు సులభంగా రుణాలు అందే విధంగా కేంద్రం చర్యలు తీసుకోవాలని ఎంపీ కోరారు.

పరిశ్రమలు బలోపేతం అయితే వరంగల్ జిల్లా ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధిస్తుందని పేర్కొన్న ఎంపీ, జిల్లాలోని యువత, వ్యాపారవేత్తల సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకునేలా కేంద్ర ప్రభుత్వంపై నిరంతరం ఒత్తిడి తీసుకొస్తానని డా. కడియం కావ్య స్పష్టం చేశారు.



# పేద వర్గాల సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం

- **పేదింటి ఆడపిల్లల తల్లిదండ్రులకు రాష్ట్ర ప్రభుత్వం చేయూత**
- **కల్యాణ లక్ష్మి పథకం ద్వారా లక్షా 116రూపాయల ఆర్థిక సహాయం**
- **సంక్షేమ పథకాల కోసం ఎవరికీ ఒక్క రూపాయి ఇవ్వొద్దు**
- **అవినీతి,అక్రమాలు లేకుండా అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు**

**వేలేరు,ఫిబ్రవరి05(తెలంగాణ ముచ్చట్లు):**

వేలేరు మండలకేంద్రంలో కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వేలేరు మండలానికి చెందిన 26 మంది కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు మొత్తం 26 లక్షల 3 వేల 16 రూపాయల విలువైన చెక్కులను ఆయన పంపిణి చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం మాట్లాడుతూ, పేద వర్గాల సంక్షేమానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. పేదింటి ఆడపిల్లల వివాహ భారం తగ్గించేందుకు కల్యాణలక్ష్మి పథకం ద్వారా ఒక లక్ష 116 రూపాయల ఆర్థిక సహాయం అందించడం తల్లిదండ్రులకు ఎంతో భరోసానిస్తోందని పేర్కొన్నారు.సంక్షేమ పథకాల కోసం ఎవరికీ ఒక్క రూపాయి కూడా ఇవ్వాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. అవినీతి, అక్రమాలకు తావు లేకుండా అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు.

కొత్తగా ఎన్నికైన సర్పంచులు గ్రామాభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని, అవినీతి, అక్రమాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఎన్నికల సమయంలో రాజకీయాలు వేరుగా ఉండాలని, ఎన్నికల అనంతరం గ్రామాభివృద్ధి కోసం అందరూ కలిసి పనిచేయాలని అన్నారు. గ్రామాల్లో అనవసర వివాదాలకు దూరంగా ఉండి, పరస్పర గౌరవంతో స్నేహపూర్వకంగా ముందుకు సాగాలని కోరారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు సంక్షేమం, మహిళా సంక్షేమం, పేద వర్గాల అభ్యున్నతిపై ప్రత్యేక దృష్టి పెట్టి అనేక కొత్త సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి పథకం ద్వారా ప్రతి ఇంటికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వంటి కార్యక్రమాలు ఇందుకు ఉదాహరణలని వివరించారు.

ఈ కార్యక్రమంలో తహసీల్దార్, సర్పంచులు, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పథకం కింద చెరువు కాలువ పునరుద్ధరణ పనులు ప్రారంభం

**వేలేరు,ఫిబ్రవరి05(తెలంగాణ ముచ్చట్లు):**

హనుమకొండ జిల్లా వేలేరు మండలం కమ్మరిపేట గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చెరువు కాలువ పునరుద్ధరణ పనులు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమాన్ని కమ్మరిపేట సర్పంచ్, వేలేరు మండలం సర్పంచుల ఫోరం అధ్యక్షుడు జోడుముంతల కిరణ్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా సర్పంచ్ జోడుముంతల కిరణ్ మాట్లాడుతూ, గ్రామ వ్యవసాయానికి చెరువులు, కాలువలే ఆధారమని తెలిపారు. మట్టితో నిండిపోయిన కాలువల కారణంగా రైతులు ఎదుర్కొంటున్న సాగునీటి సమస్యను దృష్టిలో పెట్టుకుని ఈ పునరుద్ధరణ పనులు చేపట్టినట్లు చెప్పారు. ఉపాధి హామీ పథకం ద్వారా రైతులకు నీటి సమస్య తగ్గడమే కాకుండా గ్రామీణ పేదలకు ఉపాధి కూడా కలుగుతుందని పేర్కొన్నారు. చేపడుతున్న పనులు నాణ్యతతో పూర్తి చేస్తామని, గ్రామ ప్రజలు సహకరించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ చిల్పూరి సూర్యనారాయణ, ఫీల్డ్ అసిస్టెంట్లు లావుద్య బిక్షపతి, గూటం రవీందర్, వెంకటయ్య, సాంబయ్య, రాజయ్యతో పాటు ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.



# బాసాని దయాకర్ గెలుపుకు మహిళా కార్యకర్తల ప్రచారం



**పరకాల,ఫిబ్రవరి05(తెలంగాణ ముచ్చట్లు):**

పరకాల మున్సిపల్ పరిధిలోని తొమ్మిదవ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బరిలో నిలిచిన బాసాని దయాకర్ గెలుపు కోరుతూ మహిళా కాంగ్రెస్ కార్యకర్తలు విస్తృతంగా ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి ఆదేశానుసారం స్థానికుడు, అందరికీ సుపరిచితుడైన దయాకర్ ను గెలిపించాలని కోరుతూ ఇంటింటి బొట్టు కార్యక్రమాన్ని నిర్వహించారు. అధికార కాంగ్రెస్ పార్టీతోనే పరకాల అభివృద్ధి సాధ్యమని, వార్డులో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తాడని వివరిస్తూ ప్రచారాన్ని కొనసాగించారు. ఈ సందర్భంగా మహిళా నాయకురాలు మాట్లాడుతూ బాసాని దయాకర్ కు వార్డులోని అన్ని వర్గాల ప్రజల మద్దతు లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంగెం మాజీ ఎంపీపీ కందకట్ల కళావతి, 9వ వార్డు కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు దార్న వసుంధర, బాసాని కల్పన తదితరులు పాల్గొన్నారు.

# పీచర సమ్మక్క సారలమ్మా దేవస్థానంలో హుండీ లెక్కింపు

**వేలేరు,ఫిబ్రవరి 05 : (తెలంగాణ ముచ్చట్లు):**

వేలేరు మండలం పీచర గ్రామంలోని సమ్మక్క సారలమ్మా దేవస్థానంలో హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హుండీల ద్వారా, తలనీలాల రూపంలో, కొబ్బరికాయల టికెట్ల విక్రయాల ద్వారా మొత్తం ఒక లక్ష ఎనభై రెండు వేల రూపాయల నగదు ఆదాయం సమకూరింది. అదేవిధంగా సుమారు పది తులాల వెండి కూడా లభించినట్లు దేవస్థాన అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా దేవస్థాన చైర్మన్ గోల్లేనా రమేష్ మాట్లాడుతూ, ఈ ఏడాది జాతరను అత్యంత వైభవంగా నిర్వహించామని తెలిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి సమ్మక్క సారలమ్మలను భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారని పేర్కొన్నారు. భక్తుల సహకారం, గ్రామస్తుల భాగస్వామ్యంతో జాతర విజయవంతంగా పూర్తయ్యిందని అన్నారు.ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో దేవస్థాన వైస్ చైర్మన్, డైరెక్టర్లు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఉప్పల్ ప్రెస్ క్లబ్ నూతన కమిటీ అధ్యక్ష,కార్యదర్శులుగా తిరుపతి రెడ్డి,శివాజీ

**హైదరాబాద్,ఫిబ్రవరి05(తెలంగాణ ముచ్చట్లు):**

ఉప్పల్ ప్రెస్ క్లబ్ నూతన కమిటీ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. ప్రతిష్టాత్మకమైన ఉప్పల్ ప్రెస్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా వేముల తిరుపతిరెడ్డి ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా గ్యారంపల్లి శివాజీ బాధ్యతలు స్వీకరించారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పి. సాగర్, ఉపాధ్యక్షులుగా ఏ.వి. శ్రీధర్ రావు, కూకట్ల నరోత్తమ్ రెడ్డి, కోశాధికారిగా గుత్తి శేఖర్, జాయింట్ సెక్రటరీగా దాస రాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముఖ్య సలహాదారులుగా కొలనుపాక చంద్రమౌళి, దొంతుల వెంకటరామ్ రెడ్డి, కంచు శ్రీను, కోడి కంటి శ్రీనివాస్ వ్యవహరించనున్నారు.





ఈ ఎన్నికల ప్రక్రియను ఆడ్ హక్ కమిటీ సభ్యులు వెంకట్రాం రెడ్డి, చంద్రమౌళి ఎన్నికల అధికారులుగా నిర్వహించారు. నూతన కమిటీకి బాధ్యతలు అప్పగించిన మాజీ అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ, ఈ కమిటీ రెండేళ్ల కాలపరిమితితో కొనసాగుతుందని తెలిపారు.అధ్యక్షుడిగా ఎన్నికైన అనంతరం వేముల తిరుపతిరెడ్డి మాట్లాడుతూ జర్నలిజం విలువల పరిరక్షణ, పాత్రికేయుల హక్కుల కోసం నిరంతరం కృషి చేస్తామని స్పష్టం చేశారు. ప్రెస్ క్లబ్ సభ్యుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తామని, ఉప్పల్ ప్రాంతంలోని జర్నలిస్టులను ఒకే వేదికపై ఏకతాటిపైకి తీసుకువచ్చి వారి సంక్షేమానికి పనిచేస్తామని చెప్పారు. ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో సామాజిక బాధ్యత కార్యక్రమాలు చేపట్టడం, యువ జర్నలిస్టులకు మార్గనిర్దేశం చేయడం, ప్రభుత్వ అధికారులతో సమన్వయం పెంచడం తమ కార్యాచరణలో భాగమని తెలిపారు. పత్రికా స్వేచ్ఛ పరిరక్షణకు కట్టుబడి పనిచేస్తామని ఆయన పేర్కొన్నారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in